



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 11 సంచిక : 356 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శుక్రవారం 29 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :356 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA FRI 29 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## ఏపీలో రూ. 53 వేల కోట్ల పెట్టుబడులు పెట్టే

# ప్రాజెక్టులకు ఆమోదం..

- ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోని ఎస్ఐపీబీ
- వేగంగా పారిశ్రామిక ప్రాజెక్టులు పూర్తవ్వాలన్న ముఖ్యమంత్రి
- ఏరో స్పేస్, ఐటీ, ఇంధనం, ఫుడ్ ప్రాసెసింగ్, ఎంఎస్ఎంఈ రంగాల్లో పెట్టుబడులు
- రూ.53,922 కోట్ల మేర పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
- ఈ ప్రాజెక్టులతో 83,437 మందికి ఉద్యోగ అవకాశాలు
- నవంబర్ 15లోగా ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు
- బిజినెస్ సెంటర్ల తరహాలో పారిశ్రామిక పార్కులతో ఎకో సిస్టం
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 10వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం




**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామిక ప్రాజెక్టులు వేగంగా పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో త్వరగా అనుమతులు ఇస్తున్నామని, అదే తరహాలో ప్రాజెక్టుల గ్రౌండింగ్ కూడా అంతే వేగంగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి అధ్యక్షతన 10వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది. రూ. 53,922 కోట్ల మేర పెట్టుబడులు పెట్టే 30 ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోని ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 83,437 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న ప్రాజెక్టుల పురోగతిపై ఇక నుంచి ప్రతీ నెలా

వివరాలు 2లో..

## నా ప్రశ్నకు సమాధానం చెప్పకుండా

# బూతులు తిడుతున్నారు

## బీఆర్ నాయుడుపై భూమన ఫైర్

- టీటీడీ భూములపై భూమన తీవ్ర విమర్శలు
- విలువైన భూములను టూరిజం శాఖకు ఎందుకిస్తున్నారని సూటి ప్రశ్న
- తనపై చేస్తున్న ఆరోపణలపై సీబీఐ విచారణకైనా సిద్ధమని ప్రకటించిన భూమన
- క్విడ్‌ప్రో కింద నాయుడుకి టీటీడీ పదవి వచ్చిందంటూ వ్యాఖ్య
- టీటీడీ ఛైర్మన్ పదవి శాశ్వతం కాదన్న భూమన



**పెన్ పవర్ డెస్క్:**టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుపై వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అత్యంత విలువైన టీటీడీ భూములను టూరిజం శాఖకు ఎందుకు కేటాయిస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈరోజు తిరుపతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తనపై చేస్తున్న ఆరోపణలపై సీబీఐ విచారణకైనా సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. టీటీడీకి చెందిన విలువైన భూములను టూరిజం శాఖకు బదలాయించడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటని తాను అడిగిన ప్రశ్నలకు బీఆర్ నాయుడు ఇప్పటికీ బదులివ్వలేదని భూమన ఆరోపించారు. పైగా, సమాధానం చెప్పకుండా తనను వ్యక్తిగతంగా దూషిస్తున్నారని మండిపడ్డారు. "ప్రశ్నించినందుకు బూతులు తిడుతున్నారు. ఆయన వ్యాఖ్యలు చాలా దారుణంగా ఉంటున్నాయి. అలాంటి వ్యక్తి టీటీడీ ఛైర్మన్‌గా ఉండటం హిందువుల దురదృష్టం" అని భూమన వ్యాఖ్యానించారు. బీఆర్ నాయుడును తప్పుడు ప్రచారాలకు బ్రాండ్

వివరాలు 2లో..

# తక్షణమే అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయండి



- బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఏపీలో విస్తారంగా వర్షాలు
- పరిస్థితిపై హోంమంత్రి అనిత సమీక్ష
- సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేయాలని సూచన

**పెన్ పవర్ డెస్క్:**బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యం లో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సహాయక చర్యలపై దృష్టి సారించిన మంత్రులు..

వివరాలు 2లో..

# చైనా పర్యటనకు ప్రధాని మోదీ.. జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశం



- ఏడేళ్ల తర్వాత తొలిసారిగా చైనాకు ప్రధాని నరేంద్ర మోదీ
- గల్వాన్ లోయ ఘర్షణల అనంతరం ఇదే మొదటి పర్యటన
- ఎస్సీఓ సదస్సులో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ప్రత్యేక భేటీ
- ఆదివారం టియాంజిన్‌లో ఇరు దేశాధినేతల ద్వైపాక్షిక చర్చలు
- సరిహద్దు పెట్రోలింగ్‌పై ఒప్పందం తర్వాత మెరుగుపడుతున్న సంబంధాలు

**పెన్ పవర్ డెస్క్:**భారత్, చైనా సంబంధాలలో ఒక కీలక పరిణామం చోటుచేసు కోనుంది. సరిహద్దుల్లోని గల్వాన్ లోయలో 2020లో జరిగిన ఘర్షణల అనంతరం, ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

వివరాలు 2లో..

# మోదీ కూడా ఓట్ల దొంగతనానికి పాల్పడ్డారు



- బీహార్‌లో రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర'
- బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కై ఓట్లు తొలగించారని రాహుల్ ఆరోపణ
- రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని వ్యాఖ్య
- బాధితుల్లో ఎక్కువగా బడుగు బలహీన వర్గాలవారేనని ఆరోపణ
- ఓట్ల దొంగతనంపై మరిన్ని ఆధారాలు బయటపెడతానన్న రాహుల్

**పెన్ పవర్ డెస్క్:**ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కై ప్రజాస్వా మ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, 'ఓట్ చోర్– గద్దీ ఛోడ్' అనే నినాదంతో ఆయన చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా ఈరోజు సీతామఢీలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా నుంచి

వివరాలు 2లో..

## ప్రతి ఇంటికి ఫ్యామిలీ కార్డు...

# ఉల్లి రైతులకు నష్టం వాటిల్లకూడదు

- ఆధార్ తరహాలో కొత్త కార్డుల జారీకి ప్రభుత్వం నిర్ణయం
- ప్రభుత్వ పథకాల వివరాలన్నీ ఇకపై ఒకే కార్డులో నమోదు
- రైతు బజార్ల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశం



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాల పంపిణీని మరింత పటిష్టం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ ఆధార్ కార్డు తరహాలో ఒక ప్రత్యేక 'ఫ్యామిలీ కార్డు'ను జారీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో 'ఫ్యామిలీ బెనిఫిట్ మానిటరింగ్' వ్యవస్థపై

వివరాలు 2లో..

# ఏపీలోని అంతర్జాతీయ క్రీడాకారులకు గుడ్ న్యూస్

- రూ.4.9 కోట్ల ప్రోత్సాహకాలను విడుదల చేసిన కూటమి ప్రభుత్వం
- 43 మంది అంతర్జాతీయ క్రీడాకారులకు లబ్ధి
- గత ప్రభుత్వ బకాయిలు కూడా చెల్లించిన కూటమి సర్కార్

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లోని అంతర్జాతీయ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. గత ప్రభుత్వ హయాం నుంచి పెండి ంగ్‌లో ఉన్న క్రీడా ప్రోత్సాహ కాలను విడుదల చేసింది.

వివరాలు 2లో..




# జైల్లో మిథున్ రెడ్డిని చిత్రహింసలకు గురి చేస్తున్నారు

- రాజమండ్రి జైల్లో మిథున్‌రెడ్డితో వైసీపీ నేతల భేటీ
- పెద్దిరెడ్డి కుటుంబ ప్రతిష్టను దెబ్బతీయడానికే అరెస్ట్ అని ఆరోపణ
- ఎమర్జెన్సీని మించి ప్రతిపక్షాలను వేధిస్తున్నారంటూ ప్రభుత్వంపై విమర్శ

**పెన్ పవర్ డెస్క్:**లిక్కర్ స్కాం ఆరోప ణలతో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ లో ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని ఆ పార్టీ నేతలు ములాఖత్ లో కలిశారు. మాజీ మంత్రి శంకరనా

వివరాలు 2లో..



# మోదీ ఎందుకు ఇలా చేస్తున్నారో.. అమెరికా ఆర్థికవేత్త ఆశ్చర్యం

- ట్రంప్ టారిఫ్ లు తగ్గించుకునే అవకాశం భారత్ చేతుల్లోనే ఉందన్న పీటర్ నవారో
- రష్యా నుంచి చమురు కొనడం ఆపేసిన మరునాడే అదనపు సుంకాలు రద్దు
- ఉక్రెయిన్ పై రష్యా దూకుడుకు పరోక్షంగా మోదీ ప్రోత్సహిస్తున్నారంటూ ఆక్షేపణ



**పెన్ పవర్ డెస్క్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అదనపు సుంకాలను తగ్గించుకునే అవకాశం భారత్ కు ఇప్పటికీ ఉందని వైట్ హౌస్ సలహాదారు, ఆర్థిక వేత్త పీటర్ నవారో పేర్కొన్నారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను ఆపేసిన మరుసటి రోజే అదనపు సుంకాలు రద్దు చేస్తామని చెప్పారు.

వివరాలు 2లో..

# ఎన్నికల వేళ బీహార్ లోకి చొరబడిన ఉగ్రవాదులు... హైఅలర్ట్

- రాష్ట్రంలోకి ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదుల చొరబాటు
- నిఘా వర్గాల హెచ్చరికలతో రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్
- ఉగ్రవాదుల ఫొటోలను విడుదల చేసిన పోలీసులు
- జైషే మహ్మద్ ఉగ్రవాదుల కోసం వేట

**పెన్ పవర్ డెస్క్:**అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న బీహార్‌లో ఉగ్రవాదుల కదలికలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ (జెఇఎం) ఉగ్రవాద సంస్థకు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు నిఘా

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

### చంద్రబాబులో అప్పటికీ - ఇప్పటికీ ఎంత తేడా? గమనించారా?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనలో చాలా మార్పు కనిపిస్తుంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలను తీసుకెళ్లడంలో దృష్టి పెట్టడం పక్కన పెడితే మిగిలిన విషయాల్లో ఆయన ఖచ్చితంగా వ్యవహరిస్తున్నారు. గతంలో చంద్రబాబు నాయుడు మూడు దఫాలు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా తీసుకోని రాజకీయ పరమైన నిర్ణయాలు ఈ సారి మాత్రం తీసుకుంటున్నారు. చంద్రబాబు నాయుడు గతంలో ఎమ్మెల్యేలు కానీ, మంత్రులు కానీ ఏమైనా తప్పులు చేస్తే వెంటనే చర్యలకు దిగేవారు కాదు. దానిపై సాగదీసేవారు. నాడు సోషల్ మీడియా ప్రభావం కూడా తక్కువగా ఉండటంతో అటువంటి ఘటనలపై నిజనిర్ధారణ కమిటీలను వేసేవారు. పార్టీ వారినే పంపి అందులో నిజాలను తెలుసుకునే ప్రయత్నం చేసేవారు.

**కాలయాపన చేస్తూ...**

అయితే అంతకు ముందు అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్న పోచారం శ్రీనివాస రెడ్డిని మంత్రి పదవి నుంచి తప్పించారు. అంతే తప్ప మంత్రులు, ఎమ్మెల్యేలపై తీసుకున్న చర్యలు చాలా తక్కువనే చెప్పాలి. ఎక్కువగా పార్టీ క్రమశిక్షణ కమిటీ, నిజనిర్ధారణ కమిటీలను నియమించి కాలయాపన చేస్తూ ఆ ఘటన మర్చిపోయిన తర్వాత షరా మామూలయ్యేది. కానీ ఇప్పుడు అలా కాదు. వెను వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. ఒక్క క్షణం కూడా ఆలోచించడం లేదు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక వేధింపుల విషయం తెలిసిన వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తర్వాత తాజాగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేయించారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఉండేవి కావని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు.

**గతంలో ప్రజా సమస్యలపై...**

ఇక గతంలో ప్రజా సమస్యలపై ఎవరైనా ఆందోళనలు చేసినా వెంటనే స్పందించే వారు కాదు. అలాగే విపక్ష నేతలు వెళ్లి అక్కడ పర్యటనలు చేసినా పట్టించుకునే వారు కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్తు ఛార్జీల పెంపుదలపై ఆయన కఠినంగా వ్యవహరించారు నాడు. కానీ నేడు అలా కాదు. ఏ మాత్రం నిరసనలు, ఆందోళనలు కనిపించినా వెంటనే చంద్రబాబు రియాక్ట్ అవుతున్నారు. మిరప, పొగాకు, చిత్తూరు మామిడి రైతులకు గిట్టుబాటు ధర రాకపోవడంతో విపక్ష నేత అక్కడ పర్యటనలకు చేయకముందే ఆ సమస్యపై స్పందించారు. తాజాగా దివ్యాంగులను నెలకు పదిహేను వేల రూపాయల పింఛన్లు తొలగించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆందోళనకు దిగితే వెంటనే స్పందించి అర్హులైన అందరికీ ఇస్తామని ఆయనే చెప్పారు. ఇక స్మార్ట్ మీటర్ల విషయంలోనూ ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న చంద్రబాబు కమర్షియల్ భవనాలకే పరిమితం చేయడం కూడా ఇందులో భాగమేనంటున్నారు. చంద్రబాబులో వచ్చిన ఈ మార్పు చూసిన పార్టీ సీనియర్ నేతలు మాత్రం ఆశ్చర్యపోతున్నారు.

## జైల్లో మిథున్ రెడ్డిని చిత్రహింసలకు గురి చేస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

రాయణ, మాజీ ఎంపీలు గోరంట్ల మాధవ్, మార్గాని భరత్ తదితరులు మిథున్‌రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు. ములాఖత్ అనంతరం జైలు వద్ద మీడియాతో మాట్లాడుతూ వీరు కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అనంతరం కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్య అని, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలో భాగమే ఈ అరెస్ట్ అని వారు ఆరోపించారు. గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జైలు, బెయిల్‌తోనే కాలం గడుపుతోందని ఎద్దేవా చేశారు. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని మించి చంద్రబాబు ప్రతిపక్ష నేతలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. "గతంలో ఇదే జైలు వద్దకు వచ్చిన పవన్ కల్యాణ్ మాటలు కోటలు దాటాయి. ఇప్పుడు ఆయన కనీసం గడప దాటి మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నారు. జైల్లో మిథున్‌రెడ్డిని చిత్రహింసలకు గురిచేస్తున్నారు. పాకిస్థాన్ సరిహద్దులో ఉన్నట్టుగా జైలు వద్ద భారీ గేట్లు ఏర్పాటు చేశారు" అని విమర్శించారు.

శంకరనారాయణ మాట్లాడుతూ... లిక్కర్ స్కాం పేరుతో ప్రభుత్వం ఒక కట్టుకథ అల్లిందని మండిపడ్డారు. కేవలం పెద్దిరెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకునే ఈ అక్రమ కేసు బనాయించారని అన్నారు. జగన్ ప్రతిష్టను కించపరిచేందుకు చంద్రబాబు పన్నుతున్న కుట్రలను ధైర్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. మార్గాని భరత్ మాట్లాడుతూ... ప్రభుత్వం ఆరోపిస్తున్న రూ.3,500 కోట్ల లిక్కర్ స్కామ్‌లో 90 రోజులు గడిచినా మనీ ట్రైల్‌ను ఎందుకు నిరూపించలేకపోయారని ప్రశ్నించారు. మద్యం డిస్టిలరీలు ఎవరికి ముడుపులు చెల్లించాయో ప్రజలకు వెల్లడించలేకపోతున్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వం ఎల్లకాలం ఉండదని, రాబోయేది జగన్ ప్రభుత్వమేనని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడిన వారు తప్పకుండా మూల్యం చెల్లించుకుంటారని ఆయన హెచ్చరించారు.

## చైనా పర్యటనకు ప్రధాని మోదీ.. జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశం

- మొదటి పేజీ తరువాయి

తొలిసారిగా చైనాలో పర్యటించనున్నారు. చైనాలోని టియాంజిన్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఆయన చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొంటారు. ఈ కీలక భేటీ ఆదివారం జరగనుంది. జపాన్ లో తన రెండు రోజుల పర్యటన ముగించుకుని ప్రధాని మోదీ నేరుగా చైనాకు వెళ్లనున్నారు. అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ప్రత్యేక ఆహ్వానం మేరకు మోదీ ఈ సదస్సుకు హాజరవుతున్నారు. గత నాలుగేళ్లుగా వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంబడి నెలకొన్న ప్రతిష్టంభనకు తెరదించుతూ, పెట్రోలింగ్ నిర్వహించడంపై ఇరు దేశాలు ఇటీవలే ఒక ఒప్పందానికి వచ్చిన విషయం తెలిసిందే. ఈ సానుకూల వాతావరణంలో ఈ పర్యటన జరగనుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. గతేడాది రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో కూడా ఇరువురు నేతలు సమావేశమయ్యారు.

ఈ నెల 19న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయి, ఎస్సీఓ సదస్సుకు రావాల్సిందిగా జిన్‌పింగ్ పంపిన ఆహ్వాన పత్రాన్ని స్వయంగా అందజేశారు. ఈ సమావేశం అనంతరం ప్రధాని మోదీ స్పందిస్తూ, "గతేడాది కజాన్‌లో అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తో భేటీ అయినప్పటి నుంచి ఇరు దేశాల ప్రయోజనాలకు, సున్నితత్వాలకు పరస్పరం గౌరవం ఇచ్చుకుంటూ సంబంధాలు స్థిరంగా ముందుకు సాగుతున్నాయి. టియాంజిన్‌లో జరగబోయే సమావేశం కోసం ఎదురుచూస్తున్నాను" అని 'ఎక్స్' (ట్విట్టర్) లో పోస్ట్ చేశారు. ప్రధాని మోదీ పర్యటన ఇరు దేశాల సంబంధాల మెరుగుదలకు, అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని భారత్‌లో చైనా రాయబారి జు ఫెయిహాంగ్ ఈ నెల 21న ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. ఈ పర్యటనను విజయవంతం చేయడానికి ఇరు దేశాల బృందాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయని ఆయన తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతతను కాపాడటం అత్యంత ముఖ్యమని, సరిహద్దు సమస్యకు న్యాయబద్ధమైన, పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ స్పష్టం చేసినట్లు పీఎంఓ ఒక ప్రకటనలో పేర్కొంది.

## మోదీ కూడా ఓట్ల దొంగతనానికి పాల్పడ్డారు

- మొదటి పేజీ తరువాయి

సుమారు 65 లక్షల మంది పేర్లను అక్రమంగా తొలగించారని, ఇది ఓట్ల దొంగతనం కిందకే వస్తుందని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ఓట్లను దొంగిలిస్తున్నాయి. గతంలో మహారాష్ట్ర, హరియాణా, కర్ణాటకలోనూ ఇదే విధంగా చేశారు. ఇప్పుడు బిహార్ వంతు వచ్చింది. కానీ, బిహార్ ప్రజలు తమ ఓట్లను దొంగిలించడానికి అంగీకరించరు" అని హెచ్చరించారు. తొలగించిన ఓట్లలో ఎక్కువ శాతం బడుగు, బలహీన వర్గాలకు చెందినవేనని ఆయన ఆరోపించారు. ఓట్ల చోరీకి సంబంధించి రాబోయే రోజుల్లో మరిన్ని ఆధారాలు బయటపెడతానని రాహుల్ స్పష్టం చేశారు. కొంతమంది పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చేందుకే బీజేపీ ప్రజల ఓటు హక్కును కాలరాస్తోందని ఆయన విమర్శించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కూడా దొంగిలించిన ఓట్లతోనే ఏర్పడిందని, ప్రధాని సైతం ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని సంచలన ఆరోపణలు చేశారు. యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ స్థానిక సీతాదేవి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 17న ప్రారంభమైన 'ఓటర్ అధికార్ యాత్ర' 16 రోజుల పాటు 1300 కిలోమీటర్ల మేర కొనసాగనుంది. వచ్చే నెల 1న పట్నాలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభతో ఈ యాత్ర ముగియనుంది.

# ఏపీలో రూ. 53 వేల కోట్ల పెట్టుబడులు పెట్టే ప్రాజెక్టులకు ఆమోదం..

- మొదటి పేజీ తరువాయి

సమీక్షస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఈ ప్రాజెక్టుల్లో స్థితిగతులపై క్షేత్రస్థాయిలో మంత్రులు కూడా పరిశీలించాలని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ అనుమతులు ఇచ్చిన ప్రాజెక్టుల వివరాలను, ఉత్పత్తి ప్రారంభించేందుకు ఎంత సమయం పట్టిందన్న అంశాలను విశ్లేషించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఏ ప్రాజెక్టు అయినా ఆలస్యం అవుతుంటే సంబంధిత సంస్థల ప్రతినిధులతో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని, అధికారులు కూడా అదే వేగంతో పనిచేయాలని సూచించారు. మహీంద్రా ఈవీ వాహనాల ఉత్పత్తి ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేసేలా తానే స్వయంగా సంప్రదిస్తున్నానని, దీనికి అనుగుణంగా అధికారులూ కూడా స్పందించాలని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలదే ప్రధాన భూమిక**

వ్యవసాయ ఆధారిత రాష్ట్రమైన ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలే కీలకమని, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపుతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇవి ప్రధాన భూమిక పోషిస్తాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు పుష్కలంగా అవకాశాలున్నాయని అన్నారు.

పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించేందుకు అధికారులు ప్రముఖ కంపెనీలతో సంప్రదింపులు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. చిత్తూరు, అన్నమయ్య తదితర జిల్లాల్లో స్థానికంగా ఉన్న మ్యాంగో ప్రాసెసింగ్ పరిశ్రమల వల్లే రైతులకు ఎక్కువ ఇబ్బంది లేకుండా చూడగలిగామని అన్నారు. పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటకలలో ఈ తరహా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు లేవన్నారు.

**బిజినెస్ సెంటర్ల తరహాలో ఎంఎస్ఎంఈ పార్కులతో ఎకో సిస్టం**

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు పూర్తి కావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభించిన ప్రాంతాల్లో మినహా మిగతా నియోజకవర్గాల్లో 3 నెలల్లో ఈ పార్కులు అందుబాటులోకి రావాలన్నారు. ఈ పారిశ్రామిక పార్కులన్నీ బిజినెస్ సెంటర్లలా చేసి ఒక ఎకో సిస్టంను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతులు, భూ యజమానుల్ని కూడా ఈ పారిశ్రామిక పార్కుల్లో భాగస్వాములను చేయాలని సీఎం స్పష్టం చేశారు. తద్వారా వారికి ఆదాయం వచ్చేలా చేయాలని అన్నారు. అలాగే రాష్ట్రంలో మెగా, మీడియం స్థాయిలో పారిశ్రామిక పార్కులను నియోజకవర్గాల వారీగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఈ పారిశ్రామిక పార్కులకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లను అనుసంధానించటంతో పాటు వాటికి ప్రామాణిక మార్గదర్శకాలను నిర్దేశించాలన్నారు.

పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో ఆర్టీఐహెచ్ ద్వారా జరిగే కార్యకలాపాలను సమీక్షించాలని సీఎం సూచించారు. మరోవైపు రాష్ట్రంలోని ఆటోనగర్ లలో రెడ్, ఆరెంజ్ కేటగిరీ పరిశ్రమలకు తదుపరి అనుమతులు రాకపోవటంపై సమీక్షించిన సీఎం దీనికి తగిన కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఏపీకి పరిశ్రమలు రావటం ముఖ్యమన్న సీఎం.. ఇంధన ఉత్పత్తి, ఐటీ, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్, మైనింగ్ ఆధారిత వాల్యూ చైన్ పరిశ్రమల్లో పెట్టుబడులు రావాల్సి ఉందన్నారు. అలాగే ఐటీ రంగంలో వర్క్ ఫ్రమ్ హోమ్, కో-వర్కింగ్ స్పేస్ లను ఏర్పాటు చేయాలన్నారు. మరోవైపు గత పాలకులు తిరుపతి వేంకటేశ్వరస్వామి ఏడుకొండల పవిత్రతను దెబ్బతీసేలా ప్రవర్తించారని, కొండను ఆనుకుని హోటల్ నిర్మాణానికి స్థలం కేటాయించిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయంగా స్థలం చూపామని అన్నారు. దీనిపై కొందరు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, సీఎస్ కె.విజయానంద్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**10వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదించిన ప్రాజెక్టులు**

1. మథర్ డెయిరీ లిమిటెడ్ రూ.427 కోట్లు పెట్టుబడులు, 180 మందికి ఉద్యోగాలు, చిత్తూరు జిల్లా.
2. ఏసీఈ ఇంటర్నేషనల్ లిమిటెడ్ రూ.786 కోట్ల పెట్టుబడులు, 1000 మందికి ఉద్యోగాలు, చిత్తూరు జిల్లా.
3. అపోలో టైర్స్ రూ.1110 కోట్ల పెట్టుబడులు, 500 మందికి ఉద్యోగాలు, చిత్తూరు జిల్లా.
4. స్కై రూట్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.400 కోట్ల పెట్టుబడులు, 300 మందికి ఉద్యోగాలు, తిరుపతి.
5. హెచ్ఎఫ్‌సీఎల్ రూ.1197 కోట్ల పెట్టుబడులు, 870 మందికి ఉద్యోగాలు, మడకశిర.
6. వరాహ్ ఆక్వా ఫార్మ్స్ రూ.32 కోట్ల పెట్టుబడులు, 3,500 మందికి ఉద్యోగాలు, అనకాపల్లి.
7. జె.కుమార్ ఇన్ ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ రూ.237 కోట్ల పెట్టుబడులు, 5000 మందికి ఉద్యోగాలు, విశాఖపట్నం.
8. అలీప్ సంస్థ, రూ.45 కోట్ల పెట్టుబడులు, 2,500 మందికి ఉద్యోగాలు, చిత్తూరు.
9. ఇఫ్కో కిసాన్ సెజ్ రూ.870 కోట్ల పెట్టుబడులు, 25,000 మందికి ఉద్యోగాలు, నెల్లూరు.
10. ధీరూభాయ్ అంబానీ గ్రీన్ టెక్ పార్క్ రూ.1843 కోట్ల పెట్టుబడులు, 19,000 ఉద్యోగాలు, కృష్ణపట్నం.
11. ఎన్.కామ్ వైజాగ్ హోటల్ రూ.178 కోట్ల పెట్టుబడులు, 250 మందికి ఉద్యోగాలు, భోగాపురం.
12. మంజీరా హాస్పిటాలిటీ, రూ.276 కోట్ల పెట్టుబడులు, 225 మందికి ఉద్యోగాలు, అమరావతి.
13. శ్రీ వెంకటేశ్వర లాడ్జి రూ.96 కోట్ల పెట్టుబడులు, 300 మందికి ఉద్యోగాలు, మంత్రాలయం.
14. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) రూ.1500 కోట్ల పెట్టుబడులు, 950 మందికి ఉద్యోగాలు, కొలిమిగుండ్ల, నంద్యాల జిల్లా.
15. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూ.800 కోట్లు, 200 మందికి ఉద్యోగాలు, రామగిరి, ముత్తవకుంట్ల, సత్యసాయి జిల్లా.
16. సెరెంటికా రెన్యూవబుల్స్ ఆఫ్ ఇండియా రూ.2000 కోట్ల పెట్టుబడులు, 320 మందికి ఉద్యోగాలు, అనంతపురం.
17. సెరెంటికా రెన్యూవబుల్స్ ఆఫ్ ఇండియా రూ.2,400 కోట్ల పెట్టుబడులు, 380 మందికి ఉద్యోగాలు, కర్నూలు.
18. హెక్సా ఎనర్జీ బీహెచ్ ఫైవ్ ప్రైవేట్ లిమిటెడ్, రూ.1,200 కోట్ల పెట్టుబడులు, 400 మందికి ఉద్యోగాలు, కడప.
19. రెఫెక్స్ సోలార్ ఎస్పీవీ ఫైవ్ లిమిటెడ్, రూ.480 కోట్ల పెట్టుబడులు, 345 మందికి ఉద్యోగాలు, శ్రీ సత్యసాయి జిల్లా.
20. బ్రైట్ ఫ్యూచర్ పవర్ లిమిటెడ్, రూ.3,286 కోట్ల పెట్టుబడులు, 440 మందికి ఉద్యోగాలు, అనంతపురం.
21. నవయుగ ఇంజనీరింగ్ లిమిటెడ్, రూ.15,455 కోట్ల పెట్టుబడులు, 8,400 మందికి ఉద్యోగాలు, పాడేరు.
22. చింతా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, రూ.15,050 కోట్ల పెట్టుబడులు, 8,400 మందికి ఉద్యోగాలు, కడప.
23. సిర్మా ఎస్జీఎస్ టెక్నాలజీ రూ.1595 కోట్ల పెట్టుబడులు, 2,170 మందికి ఉద్యోగాలు, నాయుడుపేట.
24. హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.586 కోట్ల పెట్టుబడులు, 613 మందికి ఉద్యోగాలు, కుప్పం.
25. బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్, రూ.485 కోట్ల పెట్టుబడులు, 500 ఉద్యోగాలు, అనకాపల్లి.
26. అదాని విల్మర్ లిమిటెడ్, రూ.578 కోట్లు, 285 మందికి ఉద్యోగాలు, నెల్లూరు జిల్లా.
27. ట్రైరోమెర్ టెక్నాలజీ లిమిటెడ్, రూ.85 కోట్లు పెట్టుబడులు, 120 మందికి ఉద్యోగాలు, చిత్తూరు.
28. ర్యామ్ శ్రీ బయో ప్రైవేట్ లిమిటెడ్, రూ. 356 కోట్ల పెట్టుబడులు, 600 ఉద్యోగాలు, కడప జిల్లా.
29. శ్రీ సర్వారాయా షుగర్స్ లిమిటెడ్, రూ.161 కోట్ల పెట్టుబడులు, 189 మందికి ఉద్యోగాలు, కోనసీమ.
30. పట్టాభి ఆగ్రోఫుడ్స్, రూ.408 కోట్ల పెట్టుబడులు, 500 మందికి ఉద్యోగాలు, కాకినాడ.

# తక్షణమే అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయండి

- మొదటి పేజీ తరువాయి

. అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేస్తున్నారు. వర్షాల పరిస్థితిపై హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు జిల్లాల కలెక్టర్లతో ఆమె ఫోన్‌లో మాట్లాడి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా కృష్ణా నది పరీవాహక ప్రాంతాలు, ఇతర లోతట్టు ప్రాంతాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను, రహదారులపై కూలిన చెట్లను వెంటనే తొలగించాలని మంత్రి ఆదేశించారు.

మరోవైపు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తన శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉత్తరాంధ్రలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో భద్రతా కారణాల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకటి రెండు చోట్ల మినహా పెద్దగా సమస్యలు తలెత్తలేదని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని గొట్టిపాటి సూచించారు. వినాయక విగ్రహాల నిమజ్జన ఊరేగింపుల సమయంలో విద్యుత్ తీగల పట్ల సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని కూడా ఆయన ఆదేశించారు.ం

# ఏపీలోని అంతర్జాతీయ క్రీడాకారులకు గుడ్ న్యూస్

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్రానికి చెందిన 43 మంది అంతర్జాతీయ క్రీడాకారులకు రూ.4.9 కోట్ల నగదు ప్రోత్సాహకాలను విడుదల చేసినట్టు అధికారికంగా ప్రకటించింది. చాలాకాలంగా ఎదురుచూస్తున్న బకాయిలు విడుదల కావడంతో క్రీడాకారులకు పెద్ద ఊరట లభించినట్లయింది. ఈ నిర్ణయంపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ రవినాయుడు హర్షం వ్యక్తం చేశారు. క్రీడలు, క్రీడాకారుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఈ చర్య నిదర్శనమని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారులు ఈ వార్తతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ఈ సందర్భంగా క్రీడాకారుల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి రవినాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ మద్దతుతో క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# మోదీ ఎందుకు ఇలా చేస్తున్నారో.. అమెరికా ఆర్థికవేత్త ఆశ్చర్యం

- మొదటి పేజీ తరువాయి

ఇక దీనిపై నిర్ణయం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల్లోనే ఉందని వ్యాఖ్యానించారు. నరేంద్ర మోదీ పరిణతి చెందిన నాయకుడని కీర్తిస్తూనే ఆయన ఎందుకు ఇలా చేస్తున్నారో అంతుబట్టడం లేదని నవారో విమర్శించారు.

ఉక్రెయిన్ పై రష్యా దూకుడుకు పరోక్షంగా మోదీనే కారణమని ఆక్షేపించారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగేందుకు ఇండియానే కారణమని, ఇది 'మోదీ యుద్ధం' అని నవారో ఆరోపించారు. భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పీటర్ నవారో ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి రాయితీపై భారత్ కొనుగోలు చేస్తున్న ముడి చమురు వల్ల ఉక్రెయిన్ పై దాడులు పెరుగుతున్నాయని పీటర్ నవారో చెప్పారు. ముడి చమురు అమ్మకాల ద్వారా సమకూరుతున్న డబ్బుతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెచ్చిపోతున్నారని, ఉక్రెయిన్ లో విధ్వంసం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి నెలకొనాలంటే భారత్ సహకరించాలని పీటర్ నవారో అభిప్రాయపడ్డారు.

## నా ప్రశ్నకు సమాధానం చెప్పకుండా బూతులు తిడుతున్నారు

- మొదటి పేజీ తరువాయి

అంబాసిడర్‌గా అభివర్ణించిన భూమన, ఆయనొక దోపిడీదారుడని, పైరవీకారుడని తీవ్ర విమర్శలు చేశారు. "జూబ్లీహిల్స్ సొసైటీలో బీఆర్ నాయుడు అనేక అక్రమాలకు పాల్పడ్డారు. ఆయన బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు. అతని అరాచకాలపై మా పోరాటం కొనసాగుతుంది" అని స్పష్టం చేశారు. క్విడ్‌ప్రో కిందనే బీఆర్ నాయుడుకి టీటీడీ ఛైర్మన్ పదవి దక్కిందని భూమన ఆరోపించారు. ఆ పదవిని అడ్డుపెట్టుకుని ఆయన రాజకీయాలు చేస్తున్నారని, వైఎస్సార్‌సీపీ నేతలను లక్ష్యంగా

చేసుకుని నిరంతరం దూషణలకు దిగుతున్నారని అన్నారు. టీటీడీ ఛైర్మన్ పదవి శాశ్వతం కాదనే విషయాన్ని బీఆర్ నాయుడు గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా భూమన హెచ్చరించారు.

## ప్రతి ఇంటికి ఫ్యామిలీ కార్డు... ఉల్లి రైతులకు నష్టం వాటిల్లకూడదు

- మొదటి పేజీ తరువాయి

ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి ఒకే కార్డు విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఈ కొత్త ఫ్యామిలీ కార్డులో ఆ కుటుంబం పొందుతున్న ప్రభుత్వ పథకాలతో పాటు అన్ని రకాల వివరాలను నమోదు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు ఈ సమాచారాన్ని అప్‌డేట్ చేస్తూ, పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రతి కుటుంబ అవసరాలను నేరుగా తెలుసుకోవాలని, ప్రభుత్వ సహాయం అవసరమైన వారికి తక్షణమే లబ్ధి చేకూరేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "కొన్ని ప్రభుత్వ పథకాల కోసం కుటుంబాలు విడిపోయే పరిస్థితి రాకూడదు. అలాంటి వాటిని నివారించేందుకు, అందరికీ ప్రయోజనం కలిగేలా పథకాలను రూపొందించే అంశాన్ని పరిశీలిద్దాం" అని తెలిపారు. రాష్ట్రంలో త్వరలోనే ఒక నూతన జనాభా విధానాన్ని (పాపులేషన్ పాలసీ) కూడా తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇబ్బందుల్లో ఉన్న ఉల్లి రైతును ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. రైతుల నుంచి ఉల్లిని తక్షణమే కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు నుంచే క్వింటాకు రూ.1,200 చెల్లించి ఉల్లిని కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఉల్లి రైతుల పరిస్థితి, ఉల్లి ధరలు ఏ మేరకు ఉన్నాయనే అంశంపై ఈ సందర్భంగా చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఉల్లి పంటకు సంబంధించిన క్రయ విక్రయాల అంశంపై చర్చించారు. ఉల్లి పంట దెబ్బ తిన్న కారణంగా... మహారాష్ట్రలో ఉల్లి పంట ఎక్కువగా ఉన్న కారణంగా ధరల విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు తెలిపారు. వచ్చే పది రోజుల్లో 5 వేల మెట్రిక్ టన్నుల ఉల్లి పంట వచ్చే అవకాశం ఉందని సీఎంకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."ఉల్లి రైతులకు నష్టం వాటిల్లకూడదు. క్వింటా ఉల్లిని రూ. 1,200 చొప్పున కొనుగోలు చేయండి. తక్షణం కొనుగోళ్లు ప్రారంభించాలి. మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ నుంచి నష్టాన్ని భరించాలి. కమ్యూనిటీ హాళ్లను అద్దెకు తీసుకుని ఉల్లిని ఆరబెట్టాలి. ఆరబెట్టిన ఉల్లిని రైతు బజార్లకు పంపిణీ చేయాలి. ఉల్లికి రేటు వచ్చేంత వరకు కమ్యూనిటీ హాళ్లలో నిల్వ చేసుకునేందుకు రైతులకు అవకాశం కల్పించాలి. రైతు నష్టపోకూడదు. వినియోగదారుడు ఇబ్బంది పడకూడదు. అన్ని పంటల ధరల స్థిరీకరణ కోసం వేర్ హౌసింగ్ సదుపాయం కల్పించాలి" అని ముఖ్యమంత్రి అన్నారు.

**రైతు బజార్ల ఆధునీకరణకు చర్యలు**

రాష్ట్రంలోని రైతు బజార్ల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలని సీఎం మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న రైతు బజార్ల సంఖ్యను పెంచాలని సూచించారు. వీటిని 150 నుంచి 200 వరకూ చేసేలా ప్రణాళిక చేయాలని అన్నారు. దీనిపై సీఎం మాట్లాడుతూ "రైతు బజార్లను నెక్స్ట్ లెవల్ కు తీసుకెళ్లాలి. మార్కెట్ యార్డుల్లోని 2-3 ఎకరాల భూమిని వినియోగించుకుని కొత్తగా ఆధునిక రైతు బజార్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలి. మార్కెట్ యార్డుల్లో వేర్ హౌసింగ్, కోల్డ్ చైన్ లను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చే యండి. రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడేలా మార్కెట్ యార్డు స్థలాలు వినియోగించాలి. ధరల నియంత్రణకు, ద్రవ్యోల్బణం పెరగకుం డా ఉండేందుకు ఈ చర్యలు ఉపకరిస్తాయి" అని సీఎం అన్నారు.

## ఎన్నికల వేళ బీహార్ లోకి చొరబడిన ఉగ్రవాదులు... హైఅలర్ట్

- మొదటి పేజీ తరువాయి

వర్గాలు హెచ్చరించాయి. ఈ సమాచారంతో అప్రమత్తమైన బీహార్ పోలీసు యంత్రాంగం రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రస్తుతం రాష్ట్రంలో పర్యటిస్తుండటంతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, రావల్పిండికి చెందిన హస్నైన్ అలీ, ఉమర్‌కోట్‌కు చెందిన ఆదిల్ హుస్సేన్, బహవల్‌పూర్‌కు చెందిన మహ్మద్ ఉస్మాన్ అనే ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదులు నేపాల్ సరిహద్దు ద్వారా బీహార్‌లోకి చొరబడ్డారు. గత వారంలో రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు నిర్ధారించాయి. దీంతో అధికారులు వెంటనే వారి ఫోటోలు, ఇతర వివరాలను అన్ని జిల్లాల పోలీసులకు పంపించారు. ముఖ్యంగా నేపాల్‌తో 729 కిలోమీటర్ల సరిహద్దు పంచుకుంటున్న జిల్లాలు, సీమాంచల్ ప్రాంతంలో భద్రతను గణనీయంగా పెంచారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, జనసమ్మర్థ ప్రదేశాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. సరిహద్దు చెక్ పోస్టుల వద్ద పెట్రోలింగ్‌ను తీవ్రతరం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే తక్షణమే సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. మరికొన్ని నెలల్లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ పరిణామం ఆందోళన కలిగిస్తోంది. గత మే నెలలో కూడా రాష్ట్రంలో 18 మంది అనుమానితులను గుర్తించగా, వారిలో ఒకరు ఖలిస్థానీ సానుభూతిపరుడిగా తేలడం గమనార్హం.

# విద్యుత్ సరఫరా నిలిపివేత

**రంపచోడవరం, మారేడుమిల్లి, గంగవరం ప్రాంతాల్లో అంతరాయం**



**గంగవరం /రంపచోడవరం,పెన్ పవర్, ఆగస్టు 28:** రంపచోడవరంలో 11 కె.వి ఫీడర్, 33 కె.వి మారేడుమిల్లి ఫీడర్, 11కె. వి గంగవరం ఫీడర్లలో నిర్వహణ పనులు, లైన్ల మరమ్మతులు, ట్రీ ట్రిమ్మింగ్ కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. రంపచోడవరం, సిరిగిందలపాడు, మారేడుమిల్లి, గంగవరం మండలాల పరిసర ప్రాంతాలు ప్రభావితమవుతాయి. వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. గాబ్రియేల్ తెలిపారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# పింఛను అర్హత నోటీసులపై అప్పీలు తుది నిర్ణయం వచ్చే వరకు పింఛన్లు యధాతథంగా కొనసాగుతాయి






**– జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 28:** ఎన్టీఆర్ భరోసా పింఛను అర్హత నోటీసులు అందుకున్న వారు సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో అప్పీలు సమర్పించుకునే అవకాశం ఇంకా ఉందని, ఇప్పటికే అప్పీలు చేసుకున్న వారికి తుది నిర్ణయం పొందే వరకు పింఛన్లు ఎటువంటి అంతరాయం లేకుండా యధాతథంగా కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. అదేవిధంగా తాత్కాలిక వికలాంగత్వం సర్టిఫికెట్లు కలిగిన అర్హులకు కూడా పింఛన్లు పంపిణీ చేయబడుతాయని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఇతర అధికారులు బొమ్మూరు కలెక్టరేట్ నుండి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ పింఛను అర్హత నోటీసులు అందుకున్న వారు మండల అభివృద్ధి కార్యాలయాల్లో అప్పీలు సమర్పించిన పక్షంలో తుది నిర్ణయం వచ్చే వరకు పింఛన్ల చెల్లింపులో ఎలాంటి అంతరాయం ఉండదని స్పష్టం చేశారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాల పునరుద్ధరణ కోసం పైకప్పు వర్షపు నీటి సేకరణ వ్యవస్థలు, చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌లు, రీచార్జ్ పిట్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అర్హులైన రైతులకు యూరియా సరఫరా చేయడం, అలాగే పీఎం కుసుమ్ పథకంలో 10 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్లాంట్ల కోసం అవసరమైన భూమిని గుర్తించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, డిఆర్ఓ సీతారామమూర్తి, సిపిఓ అప్పలకొండ, డ్వామా పీడీ నాగమహేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు, డిఆర్డిఏ పిడి మూర్తి, సర్వే ఏడి బి.లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వినాయక చవితి వేడుకలు





**గంగవరం, పెన్ పవర్,ఆగస్టు 28:**గణపతి నవరాత్రులను పురస్కరించుకొని బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి .గ్రామాల్లో భారీ గణనాధులను ప్రతిష్టించి పిల్లా పెద్దలు అందరూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ జీవితాల్లో ఎటువంటి విఘ్నాలు లేకుండా కాపాడాలంటు భక్తిశ్రద్ధలతో వినాయక చవితి నిర్వహించుకున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో భారీ గణనాధులను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

# రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా.





**ఓవర్ టెన్నేజ్ లారీలకు అడ్డే లేదు. చిద్రమవుతున్న రోడ్లు.**

**మామూళ్ల మత్తులోనే అధికార యంత్రాంగం.**

**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 28:** మైనింగ్ మాఫియా రెచ్చిపోతుంది. రేయింబవళ్లు నల్ల కంకర బౌలర్ల అధిక లోడ్ టెన్ టైర్ టిప్పర్లు తో తరలిస్తున్న పట్టించుకునే నాధుడే లేడు. ఒక లోడ్ లారీ రోడ్డు పైకి రావాలి అంటే చాలా రూల్స్ ఉన్నాయి. కానీ మైనింగ్ మాఫియా లారీలను అడ్డుకొనే అధికారులు లేరు. లారీపై తరలి వెళ్లే బౌలర్స్ చూస్తూ ఉంటే ఎక్కడ మనుషుల మీద పడిపోతాయా, లేదంటే లారీ ఎక్కడ బోల్తా పడిపోతుందో అని ప్రజలు భయపడు తున్నారు. అధిక టన్నేజ్ హైట్ లోడ్ బౌలర్స్ వల్ల ఆర్ అండ్ బి రోడ్లు సర్వ నాశనం అయిపో తున్నాయి. నల్ల కంకర క్వారీలు నిర్వహించాలంటే మైనింగ్,రెవెన్యూ, రవాణా, రక్షణ , పొల్యూషన్ తదితర శాఖల అధికారుల అనుమతులు కావాలి. స్థానికంగా నడుస్తున్న క్వారీలపై ఎమ్మార్వో, బ్రేక్ ఇన్స్పెక్టర్, పోలీస్, రవాణా శాఖ అధికారులకు ప్రతి వెహికల్ చెక్ చేసి పాసింగ్ చేయవలసిన అవసరం ఉంది. కానీ స్థానిక మైనింగ్ మాఫియా లారీలకు ఇవేమీ అక్కర్లేదు. జవసత్వాలు నశించిన రాష్ట్ర ప్రభుత్వ పాలన ఏలేశ్వరం మండలంలో దృశ్య కావ్యంగా ప్రజలకు గోచరిస్తుంది. కళ్ళుండి చూడలేని స్థితిలో పాలన సాగుతుంది కాబట్టే మైనింగ్ మాఫియా ఆగడాలు సాగుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. రాజకీయ పలుకుబడి ఉపయోగించి, అధికారులకు లంచాలు ముట్ట చెప్పడంతో మాఫియా దందా యదేచ్ఛగా కొనసాగుతుంది. కోట్లాది రూపాయలు ప్రజాధనంతో నిర్మించిన ఆర్ అండ్ బి రహదారులు ఛిద్ర మౌతున్నాయి. పెద్ద పెద్ద గోతులు పడిన రోడ్లపై పయనించాలంటే ప్రజలకు నరకప్రాయంగా ఉంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. రహదారిపై టెన్ టైర్ లారీలకు 17 టన్నులు(ఖాళీ బండి 12 టన్నులు) బండితో కలిపి సుమారు 29 టన్నులు లోడ్ మాత్రమే ఉండాలని రవాణా శాఖ పరిమితి నిబంధన ఉంది. కానీ ఏలేశ్వరం, జె అన్నవరం, గొంటువానిపాలెం తదితర ప్రాంతాల్లో అనుమతులు లేని 15 నల్ల కంకర క్వారీల నుండి పెద్ద పెద్ద బౌలర్లతో లోడ్ చేసిన టెన్ టైర్ల టిప్పర్ 50 నుండి 70 టన్నుల వరకు అధిక లోడుతో బౌలర్లు రవాణా అవుతున్నాయి. ఆర్ అండ్ బి శాఖ నిర్మించిన ఏలేశ్వరం ప్రధాన రహదారులు కేవలం 30 టన్నుల కంటే తక్కువ లోడు లారీలు పయనించడానికి మాత్రమే పనికొస్తాయి. అంతకుమించి ఓవర్ లోడ్ లారీలు ఆర్ అండ్ బి రోడ్డుపై నడిస్తే రోడ్లు ఛిద్రమౌతాయి. ఇదే పరిస్థితి ప్రస్తుతం యర్రవరం నుంచి జె.




అన్నవరం వరకు ఆర్ అండ్ బి రోడ్లు ప్రమాదంలో పడ్డాయి. ఇప్పటికే అధికంగా క్వారీలు ఉన్న ఏలేశ్వరం మండలం రమణయ్యపేట గ్రామం నుండి అడ్డతీగల మండలం గుంటువానిపాలెం, ఏలేశ్వరం మండలం జె అన్నవరం వరకు గల ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసం అయింది. సుమారు 12 కిలోమీటర్ల రోడ్డుకు ఏ విధమైన మరమ్మత్తులు గాని, పునర్నిర్మాణ కార్యక్రమాలు కానీ ప్రభుత్వం చేపట్టలేకపోయింది. కేవలం అనుమతులు లేని నల్ల కంకర క్వారీల నిర్వహణ వల్లే ప్రధాన రహదారులు దెబ్బతింటు న్నాయి అని ప్రజలు అనేకసార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టి నిరసనలు తెలిపారు. గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇది 20 సంవత్సరాల గిరిజనుల ఆవేదన. అయినప్పటికీ మైనింగ్ మాఫియా తగ్గేదే లేదు అంటుంది. ప్రజా ప్రయోజనాల తో వారికి సంబంధం లేదు. డబ్బు సంపాదన ఒకటే మాఫియా లక్ష్యం. అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. అధికారులకు, నాయకులకు సొమ్ములు భారీగా ముట్ట చెబుతున్నామని దర్జాగా బహిరంగంగానే ప్రకటన చేస్తున్నారు. ఆటవిక సమాజంలో బలం ఉన్న వాడిదే రాజ్యం అన్నట్లుగా గిరిజన గ్రామాలకు ముఖ ద్వారమైన ఏలేశ్వరంలో మైనింగ్ మాఫియా జోరుకు అడ్డు అదుపు లేదు. మైనింగ్ మాఫియాదే ఇష్టారాజ్యం. ప్రజాధనాన్ని జీతాలుగా తీసుకొంటూ ఉద్యోగాలు వెలగబెడుతున్న కొంతమంది అవినీతి అధికారుల తీరుపై ప్రజలు ఆరోపణలు గుప్పిస్తున్నారు.మాఫియా వ్యక్తులకు కొంతమంది రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు.





# సారథ్యం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**భాజపా మండల ఇన్చార్జ్ చిటికిన రమేష్.**



**టి నరసాపురం, పెన్ పవర్ , ఆగస్టు 28 :** కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని నింపేందుకు ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ రథసారథి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సారథ్యం కార్యక్రమం అన్ని జిల్లాల్లో విజయవంతం అవుతుందని సారథ్యం కార్యక్రమం ద్వారా పార్టీలో నూతన ఉత్తేజాన్ని నెలకొల్పడం జరుగుతుందని కార్యకర్తలకు భరోసా ఇస్తూ ముందుకు సాగుతున్న రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ సారథ్యం యాత్ర ఏలూరు జిల్లాలోకి సెప్టెంబర్ మూడవ తేదీన వస్తుందని టీ నర్సాపురం మండలం భారతీయ జనతా పార్టీ సారథ్యం కార్యక్రమం ఇన్చార్జి చిటికిన రమేష్ అన్నారు ఈ కార్యక్రమానికి టీ నర్సాపురం మండలం నుండి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన అన్నారు గురువారం మండల పార్టీ అధ్యక్షులు దమ్మిశెట్టి సాయి విశ్వనాధ్ అధ్యక్షతన మక్కిన వారి గూడెం లో పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మండల పార్టీ సమావేశంలో రమేష్ పాల్గొని పలు అంశాలపై చర్చించారు సుమారు టి నరసాపురం మండలం నుండి 150 మంది కార్యకర్తలు సారథ్యం కార్యక్రమానికి హాజరవుతున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు సాయి విశ్వనాథ్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఎం హరిబాబు డి కేశవరావు ఎం శ్యాంసుందర్రావు సాదు వరప్రసాద్ పి పూర్ణచంద్రరావు కె శ్రీలత సిహెచ్ వినయ్ కె రవీంద్ర బి సత్యనారాయణ కె గంగాధరరావు ఎం విష్ణు ఎస్ సురేష్ ఎస్ సత్యనారాయణ ఎస్ శ్రీను నాగార్జున బి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సాయి ప్రదీప్ ను ఘనంగా సన్మానించి లయిన్స్ క్లబ్.



**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 28:** మండల పరిధిలోని యర్రవరం గ్రామానికి చెందిన సాయి సందీప్ ను లయన్స్ క్లబ్ ఆఫ్ ఏలేశ్వరం బనానా ల్యాండ్ గురువారం ఘనంగా సన్మానించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గూగుల్ సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించిన గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్ ప్రోగ్రాంకు సాయి ప్రదీప్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం నుండి గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్ గా ఇటీవల ఎంపికయ్యాడు.జిఎస్ఎగా ఎంపికైన సాయి ప్రదీప్ ను లయన్స్ క్లబ్ ఆఫ్ ఏలేశ్వరం ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు అనుసూరి నాగేశ్వరరావు ఘనంగా సన్మానించారు.ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ స్పార్క్ ఫౌండేషన్ చేస్తున్న కృషికి, సాయి ప్రదీప్ గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్ గా ఎంపికైనందుకు చాలా సంతోషం, మన ప్రాంతంలో మేధావులైన విద్యార్థులు అనేక అంశాల్లో ప్రతిభ చాటడం గర్వంగా ఉందని అన్నారు. లయన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగిన ఎంపికలో మన ఏలేశ్వరం నుండి సాయి ప్రదీప్ ఎంపిక అవ్వడం చాలా ఆనందంగా ఉంది అన్నారు.ఈ కార్యక్రమంలో స్పార్క్ చైర్మన్ ఎస్ సాయి సందీప్,లైన్స్ క్లబ్ సభ్యులు జ్యోతుల శ్రీనివాస్,అలమండ దుర్గాప్రసాద్, తందూరి రాము,ఊర రాజబాబు,కే నాగభూషణ్,రౌతు సహదేవుడు,స్పార్క్ సభ్యులు, పర్యావరణ పరిరక్షణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



పెన్ పవర్

## డ్రైనేజీ లేక నీట మునిగిన మాణిక్యం ఇల్లు..

పంచాయతీ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న గ్రామస్తులు..

**ఎటపాక, పెన్ పవర్, ఆగస్టు 18 :**అల్లూరి జిల్లా ఎటపాక మండల పరిధిలోని గుండాల కాలనీ 9వ వార్డులో నివాసం ఉంటున్న గంపల మాణిక్యం నివాస గృహం డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కురిసిన భారీ వర్షాలకు నీట మునిగి ఇబ్బంది పడుతున్న కుటుంబాన్ని సిపిఎం గుండాల శాఖ కార్యదర్శి తోట శ్రీను మరియు స్థానికుల సహాయంతో సురక్షితమైన ప్రాంతానికి కుటుంబ సభ్యులను తరలించారు, ఈ సమస్యని పంచాయితీ అధికారులు పరిష్కరించకపోతే గ్రామ సచివాలయం ముందు ధర్నా చేస్తామని సిపిఎం పార్టీ గ్రామ కార్యదర్శి హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో పిల్లం. రాజా బర్ల నాగరాజు ,కాగిత నాగరాజు, రవి ,ప్రతాప్ ,చందు తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్ దినపత్రిక కథనానికి స్పందన...

# డ్రైనేజీ లేక నీట మునిగిన మాణిక్యం ఇల్లు.



**ఎటపాక ,పెన్ పవర్ ,ఆగస్టు 28:**అల్లూరి జిల్లా ఎటపాక మండల పరిధిలోని గుండాల కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీ లేక వర్షపు నీటితో మాణిక్యం ఇల్లు పూర్తిగా నీట ముదిగింది, అనే కథనాన్ని పెన్ పవర్ దినపత్రికలో ప్రచురించడంతో అధికారులు స్పందించి, గురువారం డ్రైనేజ్ మరమ్మతు పనులను చేపట్టారు, జెసిబి తో మాణిక్యం ఇంటి ముందు వరద నీరు పోవడానికి కాలువ తీశారు, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పెన్ పవర్ దినపత్రికకు మాణిక్యం కుటుంబ సభ్యులు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ గుండాల శాఖ కార్యదర్శి తోట శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి, పిల్లం రాజా, బర్ల నాగరాజు, రవి, ప్రతాప్ ,చందు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీపర్రు గ్రామంలో మురుగు మధ్యే ప్రజా జీవనం





**పంచాయతీలు పన్నులు వసూలు చేయడంలో తీసుకుంటున్న శ్రద్ధ పారిశుధ్యం, ములుగు గురించి పట్టించుకోవడం లేదు. మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో పలు గ్రామాలలో ప్రజలు మురుగులో జీవనం సాగిస్తున్నారు. తాగునీటి పైపులు డ్రైనేజీలలో ఉన్నా, పంచాయతీ సిబ్బంది వాటిని తొలగించడానికి చర్యలు తీసుకోవడం లేదు. వర్షాకాలంలో డ్రైనేజీలలో మురుగు పేరుకుపోయి డ్రైనేజీల నుండి మురుగు వెళ్లే మార్గం లేక దుర్వాసనతో పాటు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి అని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీలలో ఉన్న పైపులు తొలగించకపోవడంతో పైపుల ద్వారా వచ్చే తాగునీరు మురికిగాను, దుర్వాసనతో కూడిన నీటినే ఏళ్ల తరబడి తాగుతూ వ్యాధుల బారిన పడుతున్నామని పలు గ్రామాల్లోని కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

- ఎన్టీఆర్ కాలనీ మహిళల ఆవేదన
- డ్రైనేజీలలో తాగునీటి పంపులు

**ఏలూరు ఆగస్టు 28 పెన్ పవర్:** ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు గ్రామంలోని ఎన్టీఆర్ కాలనీ ఏర్పడి రెండు దశాబ్దాలు దాటింది. ఏళ్లు గడుస్తున్నా అది నీ వాసులు తాగునీరు, డ్రైనేజీల సౌకర్యం వంటి మౌలిక వసతులు లేక అవస్థల జీవనం కొనసాగిస్తున్నారు. ఈ కాలంలో సుమారు 500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాలనీలో తాగునీటి పైపులు డ్రైనేజీలలో ఉన్నా, వాటిని పట్టించుకునే నాథుడు లేక డ్రైనేజీ లలో ఉన్న పైపుల నుండి వచ్చే నీటిని తాగి రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నామని కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ కాలనీ రక్షిత తాగునీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొని, నిలయంగా మారింది. గత వైకాపా ఐదేళ్ల పాలనలో ఈ కాలనీలో మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేసింది. కాలనీ ఇళ్లల్లో వాడిన మురుగునీరు బయటకు వెళ్లేందుకు డ్రైనేజీలు లేకపోవడంతో,ఉన్న కచ్చా డ్రైన్లు చెత్తాచెదారాలు, వ్యర్థాలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి మురుగుపారుదలకు ఆటంకాలుగా మారాయి. కాలనీ ఇళ్ల నుండి వాడుక నీరు, డ్రైన్లలో మురుగు తో కలిసి కాలనీలోని చెరువులోనికి వెళ్లి చెరువు కలుషితమవుతోంది. సాయంత్రమైతే దోమల తాకిడి ఎక్కువగా ఉందని, చిన్నపాటి వర్షం వచ్చినా దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక తుఫాను లు, భారీ వర్షాలు వస్తే కాలనీవాసుల పరిస్థితి వర్ణనాతీతం. ఇటీవల నియోజకవర్గ శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గ్రామాన్ని సందర్శించినప్పుడు కాలనీవాసులు దృష్టికి తీసుకెళ్లగా, పంచాయతీ సిబ్బందిని కాలనీలో పరిశుభ్రత ఏర్పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినప్పటికీ సచివాలయ సిబ్బంది ఇటువంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలో ఫాగింగ్ యడానికి ఫాగింగ్ యంత్రం మరాయిస్తుందని, సాకులు చెబుతున్నారని, డ్రైనేజీలలో రసాయనాలు చల్లడం వంటి చర్యలకు సచివాలయం సిబ్బంది తిలోదకాలు ఇచ్చారని, రాత్రివేళ దోమలు విజృంభించకుండా కాలనీలో ఫాగింగ్, డ్రైనేజీలు శుభ్రపరచి రసాయనాలు వెదజల్లి కాలనీవాసుల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు.

# పరిశుభ్రత కానరాదు.. క్లోరి ఊసు లేదు





**ఆగస్టు 28 పెన్ పవర్:** దెందులూరు నియోజకవర్గం పెదపాడు మండలం ఏపూరు గ్రామ ప్రజల తాగునీటి కష్టాలు ఇచ్చేందుకు నిర్మించిన ఓవర్ హెడ్ అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి కొళాయిల నుండి వచ్చే మురుగునీరు తాగి జ్వరాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. వైకాపా ప్రభుత్వ పాలనలో పంచాయతీ పరిధిలోని స్మశాన వాటిక వద్ద రెండు ఓ హెచ్ ఆర్ ట్యాంకులను నిర్మించారు. పంచాయతీ సిబ్బంది నిర్వహి పంపు హాస్టల్ వద్ద మీరు వృధాగా పోతుంది. ఒక ట్యాంక్ ఇచ్చినట్లు విరిగి పోవడంతో రెండేళ్లుగా ట్యాంకులను శుభ్రపరచడం లేదు దీంతో ప్రజలు బ్యాంకులనుండి నేరుగా కొళాయిల ద్వారా వచ్చే మురికి నీరు తాగి రోగాలు బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రజలు బయట నుండి తాగునీటిని కొనుగోలు చేసి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని మహిళలు ఆరోపిస్తున్నారు. తాగునీటిని క్లోరినేషన్ చేయకుండానే కొళాయిల ద్వారా సరఫరా జరగడంతో మురికిగాను మలినాలతో దుర్వాసనతో కూడిన నీటిని తాగి రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ట్యాంక్ వాచర్ల నిర్లక్ష్యం కారణంగా తాగునీరు వృధాగా పోతున్నా సచివాలయం సిబ్బంది పట్టించుకోవడం లేదు. మోటార్లు ఆన్ చేసి ట్యాంకులు నిండి, గంటల తరబడి మోటార్లు తిరుగుతూ ఉండడంతో వీరు వృధా జరుగుతోంది. దీనివల్ల విద్యుత్ దుబారా తో పంచాయతీ విద్యుత్ చార్జీల పడుతోంది. ట్యాంకుల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీనివలన సంచారం ఎక్కువగా ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి శుభ్రమైన తాగునీరు అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు





**ఉంగుటూరు పెన్ పవర్ ఆగస్టు 28:** ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు ప్రజలందరూ కుల, మత భేదాలు మరిచి ఐక్యమత్యంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఉంగుటూరు మండలంలోని నారాయణపురం వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాన్ని ఎమ్మెల్యే సందర్శించి భక్తులను ఆశీర్వదించారు. మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు నారాయణపురంలో పలు గణపతి మండపాలను దర్శించి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం వర్తక సంఘం అధ్యక్షులు అడపా శ్రీనివాసరావు, వైసీపీ మండల కన్వీనర్ మరడ మంగారావు, మండపాల నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి : వాసంశెట్టి సత్యం





**రామచంద్రపురం,ఆగస్టు 28 పెన్ పవర్ :** మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు వృత్తి నైపుణ్య శిక్షణలు ఎంతో తోడ్పడతాయని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. గురువారం రామచంద్రపురం జూనియర్ కళాశాలలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్ఎస్ఈటిఐ ఆధ్వర్యంలో ప్రారంభమైన జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణా శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆశయం మేరకు రామచంద్రపురం నియోజకవర్గంలో ప్రతి ఇంటిలోనూ ఒక మహిళను పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న వినూత్న పథకాల భాగంగా పలు వృత్తి నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కుట్టుమిషన్ శిక్షణ, బ్యూటీషియన్ కోర్సు, ఎంబ్రాయిడరీ, జ్యూట్ బ్యాగుల తయారీ తదితర శిక్షణలు అందించామని గుర్తుచేశారు. అనుభవజ్ఞులైన శిక్షకుల ద్వారా శిక్షణ అందించి,కోర్సు అనంతరం సర్టిఫికెట్లు ఇస్తున్నామన్నారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను స్థానికంగా విక్రయించే అవకాశాలు కల్పించేలా మంత్రి సుభాష్ చర్యలు తీసుకుంటున్నా రని తెలిపారు. రానున్న పుష్కరాల సందర్భంగా మహిళలు తయారు చేసిన బ్యాగుల అమ్మకాలకూ ప్రభుత్వం సహకారం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోనసీమ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వర్మ, కాకినాడ జిల్లా ఎల్డిఎం ప్రసాద్, ఆర్ఎస్ఈటిఐ డైరెక్టర్ శ్రీనివాస్, యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సునందిని తదితరులు పాల్గొన్నారు. మహిళలకు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ద్వారా జీవనోపాధి అవకాశాలు మెరుగుపడతాయని, ముద్ర రుణాలతో వారిని మరింత ప్రోత్సహిస్తున్నామని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా 35 మంది మహిళలకు యూనిఫార్ములు, టూల్ కిట్లు (ముడి సరుకులు)ను వాసంశెట్టి సత్యం మరియు అధికారులు అందజేశారు. శిక్షణ పొందుతున్న మహిళలు మాట్లాడుతూ జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ తమ జీవనాధారానికి ఎంతో ఉపయుక్తమని, మంత్రి సుభాష్, ఫౌండేషన్ చైర్మన్ సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు...



**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్టు28:** అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజమండ్రి వారి ఆదేశాలమేరకు, చైర్మన్ మరియు జె.ఎఫ్.సి మెజిస్ట్రేట్ అడ్డతీగల ఉత్తర్వులు అనుసారం గురువారం అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో బాల్య వివాహాలు మరియు చిన్న వయసులో వచ్చే గర్భం మరియు పలు అంశాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. సతీష్, డాక్టర్, హర్ష , పారా లీగల్ వాలంటీర్ ,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్లక్ష్యపు కాంతులు



**ఏలూరు ఆగస్టు 28 పెన్ పవర్:** ఏలూరు రూరల్ మండలం శ్రీ పర్రు గ్రామంలో వీధి దీపాలు నిత్యం వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ వృధా అవుతుందని, పలుమార్లు సమస్య అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ సిబ్బంది వీధి దీపాలకు స్విచ్ బోర్డులు అమర్చి విద్యుత్ వృధా కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# బాలికల సంరక్షణపై వ్యాసరచన, వాదవివాదాలు, చిత్రలేఖనం పోటీలు

**కాకినాడ, ఆగస్టు 28 పెన్ పవర్:** అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వచ్చే అక్టోబర్ 11న వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. నరసింహ నాయక్ తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరాలు వెల్లడించారు. బాలికల సంరక్షణ, రక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఎస్సే రైటింగ్, డిబేట్స్, పెయింటింగ్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. నగర, మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జిల్లాస్థాయిలో జరిగే తుది పోటీల్లో పాల్గొననున్నారు. పోటీలలో మొదటి బహుమతి రూ.5,000, రెండవ బహుమతి రూ.3,000, మూడవ బహుమతి రూ.2,000గా నిర్ణయించగా, మొత్తం మూడు విభాగాల్లో కలిపి రూ.30,000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని కోరారు. ఆసక్తి గల వారు తమ వివరాలను సమయానికి సంబంధిత అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

# ప్రజావేదన ...పట్టించుకోని పాలన

- గోతులతో గొల్లుమంటున్న ప్రయాణికులు
- అధికారులు కనికరం లేకుండా ఉంటున్నారంటూ ప్రయాణికులు ఆవేదన





**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు28:** గోతులు పడిన రహదారిలో ప్రయాణికులు గొల్లుమంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలంలోని సీతానగరం నుండి పురుషోత్తపట్నం వైపుకు వెళ్లే 10 కిలోమీటర్లు ప్రధాన ఏటిగట్టు రహదారి ఈ మార్గానికి రామచంద్రపురం వంగలపూడి సింగవరం తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు ఈ రహదారిపై ఆధారపడి ఉంది. ఇదే రహదారిపై పోలవరం ప్రాజెక్టుకు భారీ వాహనాలు తరలి వెళ్తాయి. పోచమ్మ గండి పాపికొండలు విహారయాత్రకు భారీగా ఈ రహదారిలో తరలి వెళ్తారు. ఇంతపెద్ద రద్దీగా ఉన్న రహదారిలో గోతులు పడడంతో ప్రయాణికులు నరకయాతన పడుతుంటే నాలుగు నెలల క్రితం 12 కోట్ల రూపాయలతో శంకుస్థాపన చేశారు. అయినా పనులు ముందుకు సాగలేదు. గోతులు పూడ్చడం లేదు పనులు ముందుకు సాగడం లేదు. దీంతో నరకయాతన పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ గోతులు వల్ల నిత్యం ఏదో ప్రమాదం చోటు చేసుకుంటూనే ఉన్నాయి. కొన్ని ప్రమాదాలు బయటపడుతున్నాయి. కొన్ని ప్రమాదాల్లో పలువురు గాయపడుతున్నారు. వాహనాలు తిరగబడి ఏటిగట్టు పైనుంచి కింద పడుతున్నాయి. ఈ రహదారుల శాఖ అధికారులు కనికరం లేనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ప్రయాణికులు ఆవేదనచెందుతున్నారు.

గోతులు పడిన మార్గంలో కాస్త దూరానికి వాహనాలు వెళ్ళటానికి ఎక్కువ సమయం పడుతుంది. పెద్ద వాహనాల నుంచి ద్విచక్ర వాహనాల వరకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఈ మార్గంలో గోతులు చిన్నవిగా ఉన్నప్పుడు వాటిని పూడ్పించాలని ప్రజలు మొరపెట్టుకుంటున్న సంబంధిత అధికారులు ఆలకించలేదని ఇప్పుడు ఈ గోతులు పెద్దవి అయ్యాయని ప్రయాణికులు వాపోతున్నారు. చిన్నవిగా ఉన్నప్పుడే ఈ గోతులను పూడ్చితే పెద్దవి అయ్యేవి కాదని ప్రజలు అంటున్నారు. గోతులు పెద్దవిగా ఉండడంతో ప్రయాణానికి కష్టంగా మారింది. ఈ గోతులను దాటుకుని వెళ్లడం గగనంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ గోతులను పూడ్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. కనికరం లేకుండా వ్యవహరించవద్దని అధికారులకు మొర పెడుతున్నారు,

# బార్ల లైసెన్స్ డ్రా ఆగస్టు 30న

**కాకినాడ, ఆగస్టు 28 పెన్ పవర్:** కాకినాడ జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి పరిధిలోని బార్లకు 2025%-%2028 సంవత్సరాల లైసెన్సుల మంజూరుకు సంబంధించిన డ్రా ఆగస్టు 30వ తేదీ ఉదయం 8 గంటలకు జరుగనుంది. ఈ డ్రా కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని వివేకానంద హాల్లో లాటరీ పద్ధతిలో నిర్వహించ బడుతుందని అధికారులు తెలిపారు. డ్రాలో ఎంపికైన వారికి బార్ల లైసెన్సులు మంజూరు చేయబడతాయి. దరఖాస్తులు చేసిన అభ్యర్థులు ఆ రోజు ఉదయం 7.30 గంటలకు ఎంట్రీ పాస్‌తో పాటు ఆధార్ కార్డు తీసుకొని హాజరు కావాల్సి ఉంటుందని జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి కె. కుమారి ఒక ప్రకటనలో తెలిపారు.

# గణనాథుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి

- వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడగిరి బాబు





**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 27:**గణనాథుడి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ప్రతి కుటుంబంలోనూ సుఖశాంతులు నిలవాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రమైన కిర్లంపూడి సంత మార్కెట్ లో వేంచేసియున్న శ్రీ లక్ష్మిగణపతి ఆలయంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరునికి, ఏనుగు వీధిలో వినాయకుని విగ్రహానికి ముద్రగడ గిరిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగడమే కాకుండా,ప్రతి ఒక్కరిలోను భక్తి భావం పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన గిరిబాబును వేదపండితులు కండువాతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా గిరిబాబు ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పెంటకోట నాగబాబు, గంధం దుర్గాజీ, దేవులపల్లి వీరబాబు, అడ్వకేట్ లింగంపల్లి శివ, కరణం వెంకటేశ్వరరావు, మండపాక చలపతి, కురమళ్ళ చిన్ని, కరణంకాశీ కూనూరి వీరసత్తి తదితరులు పాల్గొన్నారు.

# సీఎండీ లేఅవుట్ లో ఘనంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించిన కంబాల

- వినాయకుని మండపాలకు 2.76 లక్షల విరాళం ప్రకటించిన కంబాల





**గోకవరం, పెన్ పవర్,ఆగస్టు 28**: విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పద్మావతిదేవి దంపతుల ఆధ్వర్యంలో గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ లేఅవుట్ వద్ద వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సీఎండీ లేఅవుట్ లో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద కంబాల శ్రీనివాసరావు దంపతులచే అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథరావు శర్మ పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద కాంప్లెక్స్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణపతి మండపాన్ని కంబాల శ్రీనివాసరావు దర్శించుకుని వినాయక మహోత్సవలకు లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. అలాగే మెయిన్ రోడ్డులోని వినాయక ఆలయం వద్ద గణపతి మండపాన్ని దర్శించుకుని, లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. అనంతరం డ్రైవర్స్ కాలనీలోని విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాన్ని దర్శించుకొని, మండపానికి కొత్త సౌండ్ సిస్టమ్ కోసం 76 వేల రూపాయలు విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే రామన్న దొర, దాసరి వారి వీధి, వెలం పేట, సూర్య ఫంక్షన్ హాల్ రోడ్డు, సంజీవయ్య నగర్, కృష్ణుని పాలెం, బంగాళీ పేటలోని మండపాలను, దర్శించుకున్నారు. ఆయా గణపతి మండపాల వద్ద కమిటీ సభ్యులు కంబాల శ్రీనివాసరావుకి ఘన స్వాగతం పలికారు. మహిళలు హరతులు పట్టి, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు వరసాల ప్రసాద్, దాసరి ధర్మరాజు, బత్తుల నానాజీ, పసల గణేష్, నాని, పద్దరాజు, ప్రగాఢ ప్రభ, జీ.నాని, పదిలం మురళి, దోసపాటి సుబ్బరావు, దాసరి బాలు, నాగ రమేష్, వీరంజలి, మళ్ల అదిశేషు, కాకర దుర్గారావు, దోసపాటి వీరబాబు, మండే గౌతమ్, పోతుల బుల్లబ్బాయి, నందూరి దుర్గారావు, కేబుల్ రాజు, ఆయా గణపతి మండపాల కమిటీ సభ్యులు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# హౌసింగ్ కాలనీల నిర్మాణాలపై ప్రత్యేక రివ్యూ





**వై రామవరం, పెన్ పవర్, ఆగస్టు 28 :** మండలం లోయర్ పార్ట్ లో ఉన్న 11 పంచాయతీల సిబ్బంది, కార్యదర్శులతో హౌసింగ్ కాలనీల నిర్మాణాలపై ప్రత్యేకంగా సమావేశం గురువారం నిర్వహించడం జరిగిందని వై రామవరం ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.

గురువారం మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీపీ ఆనందరావు, మండల స్పెషల్ ఆఫీసర్ దయానంద్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులపై రివ్యూ మీటింగ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. జి ఎస్ డబ్ల్యూ ఎస్ సర్వీసులు, భూముల సర్వేలు ఎంతవరకు జరిగాయని తెలుసుకోవడం జరిగిందన్నారు. హౌసింగ్ కాలనీల నిర్మాణాలపై సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేకంగా రివ్యూ నిర్వహించడం జరిగిందని తెలిపారు. తల్లికి వందనం,

హౌసింగ్ కాలనీలోజియో టాగింగ్, ఎంప్లాయ్ అటెండెన్స్, గ్రీవెన్స్ లో ఫిర్యాదుల పరిష్కారం, సచివాలయం కార్యదర్శుల భవన నిర్మాణాలు ఏ స్టేజ్ లో ఉన్నాయని తెలుసుకున్నారు. పాఠశాల తనిఖీ విషయమై సిబ్బందిని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వెంకటలక్ష్మి, వై రామవరం ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, ఏపీవో సాయిబాబా, గ్రామ సచివాలయాల సిబ్బంది కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈవీఎం, వీవీప్యాట్ గోదామును తనిఖీ చేసిన జేసీ రాహుల్ మీనా





**కాకినాడ, ఆగస్టు 28 ,పెన్ పవర్:**కాకినాడ కలెక్టరేట్ పరిధిలోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా గురువారం పరిశీలించారు. ఆయనతో పాటు రెవెన్యూ, ఎన్నికల, పోలీసు శాఖల అధికారులు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గోదాములో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు, వీవీప్యాట్ల రక్షణ, భద్రతా ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. భద్రతా చర్యలపై అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు.జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ, "ఈవీఎం, వీవీప్యాట్లకు పటిష్టమైన భద్రత కల్పించాలి.భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి నెల గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి నివేదిక పంపుతున్నాం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎస్. మల్లి బాబు, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం. జగన్నాథం, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల ఆద్యులు ఎన్టీఆర్.



**కపిలేశ్వరపురం, పెన్ పవర్,ఆగస్టు 28.** సంక్షేమ పథకాలకు ఆద్యులు ఎన్టీఆర్ అని పేద బడుగు వర్గాలు గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా ఉంటారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.

కపిలేశ్వరపురం మండలం వల్లూరు లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్,ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ ఆనాడు ముఖ్యమంత్రి గా ఎన్టీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పదకాలే నేటికి అమలవుతున్నాయని పేర్కొన్నారు. అప్పట్లో నెలకు 40 రూపాయలుతొ పెన్షన్, కిలో రెండు రూపాయలకే రేషన్ బియ్యం, మహిళలకు ఆస్తి లో సమాన హక్కు, పేదలకు ఇళ్ళ పట్టాలు, పక్కా ఇళ్ల నిర్మాణ వంటి పథకాలు ఎన్నో ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్ దేనని పేర్కొన్నారు. ఆనాడు ఎన్టీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలే దేశంలో మిగతా రాష్ట్రలలో కుడా అమలు అవుతున్నయని అన్నారు.రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్, జన సేన ఇన్ ఛార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తుందని పేర్కొన్నారు. గ్రామాలు అభివృద్ధి దిశగా పనిచేస్తున్నాయని చెప్పారు.అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ లతో కలిసి గ్రామంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో మంత్రి పాల్గొన్నారు. వల్లూరు శ్రీ సత్యనారాయణ ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘం త్రిసభ్య కమిటీ సభ్యులుతో మంత్రి ప్రమాణం స్వీకారం చేయించారు. అనంతరం వల్లూరు చెరువుగట్టు పై ఉన్న ఇళ్లను ఖాళీ చేసిన 15 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. సుమారు 40 లక్షల ప్రభుత్వ నిధులతో నిర్మించిన వాటర్ టెంక్ ను, సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండపేట మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, వల్లూరి వీరబాబు, మండల స్థాయి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు అదిక సంఖ్యలో పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి-బారనాల శంకరరావు




**తాళ్ళపూడి, పెన్ పవర్, ఆగస్ట్ 28:**నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతిని అమలు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమానికి తాళ్లపూడి మండలం నుండి సీపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏపిసిపిఎస్ఈఏ సభ్యులు బారనాల శంకరరావు కోరారు. ఇందుకు సంబంధించి గోడ పత్రికలను వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలో ఆవిష్కరణ చేసారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తమ సమస్యపై దృష్టిసారించి పరిష్కరించాలని కోరారు.

కార్యక్రమంలో సంస్థ సభ్యులు డి.రాము, టి.వెంకటరమణ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గా నల్లా పవన్



**అమలాపురం. పెన్ పవర్ ఆగస్టు 28 :**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అమలాపురం కి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు నల్లా పవన్ కుమార్ నియమితులయ్యారు. గురువారం పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన లిస్టులో ఆయన పేరు ఉంది. ఆయన ఇప్పటి వరకు జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు గా పని చేశారు.రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ సారధ్యంలో డా.బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి రాష్ట్ర పదాధికారిగా నల్లా పవన్ కు చోటుదక్కింది. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, రాజ్యసభ ఎంపీ పాకా సత్యనారాయణ, మాజీ రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావు,జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ,జాతీయ కౌన్సిల్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, రాష్ట్ర 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ లంకా దినకరన్, పలువురు పార్టీ నాయకులు, అభిమానులు నల్లా పవన్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# వినాయక ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఆగస్టు 28** :వినాయక చవితి పండుగ అనేది ఏకత్వానికి సత్సంకల్పం కు ప్రతీక అని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బుధవారం దర్భ గూడెం, గ్రామ%శీ%లో వినాయక చవితి పండుగ లో పాల్గొని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఇళ్లలో ఐశ్వర్యం, ఆరోగ్యం, సంతోషం నెలకొనాలని ప్రార్థించారు. ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు తమ్మన సాంబ ,సొసైటీ అధ్యక్షులు అక్కి శెట్టి ప్రసాద్, కూటమి నాయకులు బుడుపుటి చిరంజీవి, తణుకు శ్రీనివాస్, కొప్పుల నాగయ్య, బుర్ర ఏసు, ఇంగుర్తి వెంకటేష్ ,సన్యాసి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యుత్ పోరాట అమరవీరులకు జోహార్లు




**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఆగస్టు 28:** బషీరాబాద్ విద్యుత్ అమరవీరుల త్యాగాలను ప్రజలందరూ కొనియాడాలని,ఆదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని-ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో జీలుగుమిల్లి లో గురువారం జగదంబ సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. వామపక్ష ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేకమైన ఆదాని స్మార్ట్ మీటర్లను బిగించవద్దు అని, పెంచిన కరెంటు చార్జీలు మరియు సర్చార్జీలను తగ్గించాలని విద్యుత్ ఉద్యమ అమరవీరుల స్ఫూర్తితో ప్రతిజ్ఞ పూనడం జరిగింది. ఈ సందర్భంగా వామపక్ష పార్టీ ప్రజాసంఘాల నాయకులు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు ఈ. భూషణం, సిపిఐ మండల కార్యదర్శి కారం దారయ్య, సిపిఐ ఎంఎల్ ప్రజాపందా నాయకులు కట్టం ముత్యాలరావులు మాట్లాడుతూ విద్యుత్ పోరాట అమరవీరులు కామ్రేడ్ రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి మరణించి నేటికీ 25 సంవత్సరాల అయినా సందర్భంగా వారికి నివాళులర్పిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగినది . 2000 సంవత్సరంలో నాటిఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలని ఆగస్టు 28న బషీర్బాగ్ దగ్గర శాంతియుతంగా ధర్నా చేస్తున్న ప్రజలపై అప్పటి ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా లాఠీ చార్జీలు, బాష్ప వాయువులు ఉపయోగించి, తుపాకీ గుళ్ళతో కాల్పులు జరిపి ప్రజలను చంపారని వారు అన్నారు. ఎంతోమంది ఈ ఘటనలో గాయపడ్డారని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు బిగించిన స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టండి అని పిలుపునిచ్చారు. నేడు అధికారంలోకి రాగానే ప్రభుత్వం రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లను ప్రజల అనుమతి లేకుండానే . అధికారంలోకి వచ్చి గత ప్రభుత్వ విధానాలను అమలు చేస్తుందని విమర్శించారు. అంతేకాకుండా కరెంట్ చార్జీలను, ట్రూ అప్ చార్జీలు పెంచడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఇటువంటి విధానాలను అనుసరిస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతి కూటమి ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. విద్యుత్ సంస్కరణలకు మరియు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలు ప్రజాస్వామిక వాదులు నిరసనను తెలియజేయాలని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు పెంచి ప్రజలపై ఆర్థిక బారాలను మోపుతుందని, ప్రజల నడ్డి విరిచే విధంగా వ్యవహరిస్తుంది అన్నారు. అధికారం రాకముందు ఒక మాట వచ్చిన తర్వాత ఒక మాట మాట్లాడడం సరైనది కాదన్నారు. పేద ప్రజలకు సబ్సిడీ ద్వారానే కరెంటును అందించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తావని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం నాయకులు కట్టం నాగేశ్వరరావు, డోలా నరసింహారావు, ఊకె వెంకటేశ్వరరావు, దాకారపు వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు, కొప్పుల నాగరాజు, కరటం వెంకటేశ్వర్లు, శ్రీను సిపిఐ ఎంఎల్ ప్రజా పందా నాయకులు సోయం చంద్రావు, సోడే విజయ్, కారం సత్యవతి, మడివి కన్నమ్మ, ఎంపీటీసీ కట్టం రత్తమ్మ, సర్పంచ్ మామిడి గంగమ్మ సిపిఎం నాయకులు, దాసరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిలో అదృశ్యం అనుమానం...!

- పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం...



**కపిలేశ్వరపురం, పెన్ పవర్, ఆగస్టు28.** కపిలేశ్వరపురం మండలం, కేదార్లంక గ్రామ పంచాయితీ వీధివారి లంకకు చెందిన పల్లి చిట్టియ్య (65) తాతపూడి లంకకు వెళ్లి తిరిగి రాలేదు. గోదావరిలో ప్రమావశాత్తు పడి గల్లంతు అయ్యి ఉండవచ్చని అనుమానం వ్యక్తమవుతోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గల్లంతైన వ్యక్తి కోసం %ూణ=ఖీ% టీంతో కలిసి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు, రామచంద్రాపురం %ూణూ% రఘువీర్ పర్యవేక్షణలో మండపేట రూరల్ సీఐ దొరరాజు, ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, అంగర ఎస్పై జీ.హరీష్ కుమార్, కపిలేశ్వరపురం మండల తాసిల్దార్ జీ.శ్రీనివాస్, గోదావరి తొగరపు పాయ వద్ద గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. గోదావరిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గాలింపు చర్యలు కష్టతరంగా మారాయి.

ఇతని గురించి ఏవైనా ఆచూకీ తెలిసిన వారు కింది నంబర్లకు సమాచారం ఇవ్వగలరు:

అంగర పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి హర్షకుమార్ 9440900770 నెంబర్ సమాచారం ఇవ్వాలని కోరారు.

## ఏపీ బిజెపి అధ్యక్షులు మాధవ్ పర్యటన



**జిలుగుమిల్లి, పెన్ పవర్, ఆగస్టు 28 :** ఆంధ్ర ప్రదేశ్ బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ సెప్టెంబర్ మూడవ తేదీన ఏలూరు రానున్నారని జిల్లా బిజెపి కార్యదర్శి చాట్రాతి ప్రసాదు అన్నారు. గురువారం జీలుగుమిల్లి లో ఆయన నివాసం వద్ద బిజెపి మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపిని బలోపేతం చేసే విధంగా రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ కార్యచరణ రూపొందిస్తున్నారని అన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబు, సీనియర్ నాయకులు కొండపల్లి ప్రసాద్, పులగం సుబ్బారెడ్డి ,ఊక సూర్యచంద్రం, రేపాక గోపాలం, ప్రసాద్ రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దేవీపట్నంలో ది న్యూ ప్లస్ క్లబ్ స్థాపన...



- కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైన సీనియర్ జర్నలిస్టులు..
- 20 మంది సభ్యులతో జర్నలిస్టులకు వేదికగా ప్రెస్ క్లబ్...

**దేవీపట్నం,పెన్ పవర్,ఆగస్టు28:** దేవీపట్నం మండలంలో జర్నలిస్టుల ఐక్యత,అభివృద్ధి, మరియు సామాజిక బాధ్యతల దృష్ట్యా ది న్యూ ప్లస్ క్లబ్ దేవీపట్నం పేరుతో నూతన ప్రెస్ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు గౌరవ అధ్యక్షులు కేశవరపు చంద్ర కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,జర్నలిస్టులు ప్రజల సమస్యలను వెలుగులోకి తేవడమే కాకుండా సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తారని,ఆ క్రమంలో జర్నలిస్టులకు ఒక వేదిక అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ కొత్త క్లబ్ జర్నలిస్టులకు వృత్తి పరంగా బలాన్ని ఇచ్చే కేంద్రంగా మారాలని ఆశాభావం వ్యక్తం చేశారు. క్లబ్ స్థాపన సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా యం. ఫణి మోహన్, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.చిట్టి బాబు, కోశాధికారిగా కె. రాంబాబు,కార్యదర్శిగా జె. సత్య శేఖర్,అలాగే ఉపాధ్యక్షులుగా ఆర్.రాంబాబు నియమితులయ్యారు. ఈ క్లబ్‌లో మొత్తం 20 మంది సభ్యులు ఉన్నారని గౌరవ అధ్యక్షులు తెలిపారు. భవిష్యత్తులో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి,వృత్తి నైపుణ్యాభివృద్ధికి,మరియు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల నిర్వహణకు ఈ ప్రెస్ క్లబ్ వేదికగా పనిచేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా రాబోయే రోజుల్లో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పలు అవగాహన సదస్సులు, సామాజిక కార్యక్రమాలు,రక్తదాన శిబిరాలు,పత్రికా ప్రతినిధుల కోసం శిక్షణా శిబిరాలు కూడా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

## విద్యతోనే పేదరికం నిర్మూలన.

- ఎంబిబిఎస్ సీటు సాధించిన దినేష్ కు రూ.50 వేలు ఆర్థిక సాయం.
- వైసిపి నేత రమణారావు.




**అమలాపురం.పెన్ పవర్ ఆగస్టు 28 :** విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, విద్యతోనే పేదరిక నిర్మూలన జరుగుతుందన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆలోచనా విధానంతో ప్రతి ఒక్కరూ విద్యలో ఉన్నతులు కావాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు,గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు కోరారు.అయినవిల్లి మండలం నేదునూరు పెదపేటకు చెందిన నామాడి శ్రీనివాస్ కుమారుడు దినేష్ నీట్ లో మంచి ర్యాంకు వచ్చి ఎంబిబిఎస్ సీటు సాధించాడు.ఈ సందర్భంగా గురువారం అమలాపురం గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో ఎంబిబిఎస్ సీటు సాధించిన దినేష్ ను రమణారావు సత్కరించారు.దినేష్ కు రమణారావు దుశ్శాలువా కప్పి అభినందించి ప్రోత్సహకంగా రూ. 50 వేలు చెక్కును రమణారావు దినేష్ కు అందించి,మరింత ఉన్న శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో నాయకులు సరెళ్ళ రామకృష్ణ,పరమట రాజశేఖర్,గంటా లక్ష్మీ ప్రసాద్,షేక్ బాబ్జి, పందిరి సుబ్బరాజు, గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## నీరు కారుతున్న స్వచ్ఛంద లక్ష్యం






- సంపద కేంద్రం వద్ద చెత్తకు నిప్పు
- యంత్రాంగానికి పట్టని వైనం

**ఏలూరు ఆగస్టు 28 పెన్ పవర్ :** పెదవేగి మండలం వంగూరు గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా మారింది. గ్రామ సచివాలయం సిబ్బంది నిర్వహణ లోపాలు గ్రామంలో ప్రజల ఆరోగ్యం పట్ల శాపంగా మారింది. చెత్తను తగలబెట్టడం ద్వారా పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెత్త సేకరణ మాట అటు ఉంచితే కొన్నేళ్లుగా ఈ కేంద్రం వైపు ఎవరు ఎవరూ వచ్చినట్టు లేదు. గ్రామంలో సేకరించిన చెత్తను సంపద కేంద్రం వద్ద రహదారికి ఇరువైపులా పోసి తగలబెడుతున్నారు. దీనివలన వచ్చే పొగతో స్థానికులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇదే పరిస్థితి కొన్నేళ్ళనుంచి కొనసాగిస్తున్నారు. తడి పొడి వ్యర్థాల సేకరణ, వర్మి కంపోస్ట్ తయారీకి వీలుగా ఏర్పాటు చేసిన నాడప్ తొట్టెలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. తొట్టెలలో వర్మీ కంపోస్ట్ ఎరువు తయారు కావడం లేదు. చెత్తను తరలించే రి క్షాలు సైతం పాడైపోవడంతో గ్రీన్ అంబాసిడర్లు రిక్షాలు మరమ్మతులకు నోచుకోక రిక్షాల అందుబాటులో లేక ఖాళీగా ఉంటున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పారిశుధ్య సమస్యలు తోడైతే ఎక్కడ వ్యాధులు ప్రభలుతాయోనని స్థానికలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పెదవేగి ఎంపీడీవో శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాల్లో సంపద సృష్టికి సన్నాహాలు చేస్తున్నామని, ఎక్కడైనా చెత్తకు నిప్పు పెట్టినట్లు తెలిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. అన్ని డంపింగ్ యార్డ్ లలో చెత్త నిర్వహణ చేపడుతున్నాం. ఎక్కడైనా ఈ పనులు చేయకుంటే చర్యలు ఉంటాయన్నారు.

## కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ రావిరాల మహేష్ కుమార్ ప్రజాప్రతినిధులు తో బేటీ



**అమలాపురం.పెన్ పవర్ ఆగస్టు 28:** పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు) కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ తో భేటీ అయ్యారు.యానాం సముద్రం నుండి ఐలాండ్ నెంబర్ మూడు మీదుగా ఓఎన్జిసి కి వెళ్లిన పైప్లైన్ లీకైన సంఘటన సంబంధించి జిల్లా కలెక్టర్ వినతిపత్రం ఢిల్లీ ప్రతినిధి మల్లాడి, ఎమ్మెల్యేలు, అనందరావు, కొండబాబులు అందజేశారు.

జరిగిన పైప్లైన్ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు వివరించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి , స్థానిక మత్స్యకారులకు, ప్రజలకు రక్షణతో పాటు, పరిహారం అందించాలని ఢిల్లీ ప్రతినిధి మల్లాడి, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, వనమాడి కొండబాబు కోరారు.

# భయం గుప్పిట్లో





**వి.ఆర్.పురం పెన్.పవర్. ఆగస్టు.28:** మరోసారి వరదదెబ్బ భయంగుప్పిట్లో విలీన మండలాలు,ఏంచేయాలో అర్థం కాక బిక్కుబిక్కుమంటూ పరివాహాక ప్రాంత పోలవరంనిర్వాసితులకు పడుతున్న బాధలు వర్ణనాతీతం. వారంరోజుల క్రితం వరకు ఇబ్బందులు ఎదుర్కొన్నవరద బాధితులకు మరో వరదదెబ్బ కంటిమీద కునుకులేకుండా చేస్తుంది. ఏరాత్రి ఎటువైపు నుండి వరద వస్తుందోనని గోదావరి,శబరి, నదులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ భయం గుప్పిట్లో బతుకుతున్నారు.వ్యవసాయ కూలీలకు పనులులేక జీవనోపాధి లేదు.వ్యవసాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.గోదావరి,శబరి,వరదలు పోవాలి అప్పుడు వ్యవసాయపనులు మొదలయ్యే పరిస్థితి. పోలవరం బ్యాక్ వాటర్ వలన నీరుఎప్పుడూ వ్యవసాయ పొలాల్లోనే వరద తిష్టవేసుకోని ఉంటుంది.గోదావరి, శబరి, వరదల్లో అధికారుల పనితీరు అద్భుతంగా ఉంది. అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ ముందు జాగ్రత్త చర్యలు చేపడుతు న్నారు.పోలీస్, రెవెన్యూ,మండల అభివృద్ధి,వెలుగు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో వినాయకచవితి వేడుకలు



**పెద్దాపురం, పెన్ పవర్, ఆగస్ట్ 28 :** పెద్దాపురం పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించుకున్నారు. వాడవాడలా ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు, భారీ సెట్టింగ్‌లు, మండపాల్లో గణనాథులు కొలువుదీరారు. భక్తులు వినాయక చవితి పూజ, వ్రతాలను తమ ఇళ్ళ వద్ద భక్తిప్రపత్తులతో తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

# కురసాల కన్నబాబుకు ముద్రగడ గిరిబాబు పరామర్శ.





**కిర్లంపూడి, పెన్ పవర్ ఆగస్టు 28:** మాజీ మంత్రి ఉత్తరాంధ్ర జిల్లాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబును ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. ఇటీవల కన్నబాబు తండ్రి కురసాల సత్యనారాయణ మరణించారు. విషయం తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు కాకినాడ కన్నబాబు నివాసానికి వెళ్లి సత్యనారాయణ చిత్రపటానికి గిరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ మృతి తీరని లోటు అని ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైసిపి నాయకులు బదిరెడ్డి గోవింద్, శిడగం వెంకటేశ్వరరావు, రామిశెట్టి నాని, సామంతుల సూర్య కుమార్, కోరాడ ప్రసాద్, రామిశెట్టి దొరబాబు, గొల్లపల్లి దొరబాబు, పెంటకోట నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

# వారం రోజుల్లో చోరీ కేసును ఛేదించిన ప్రత్తిపాడు పోలీసులు

- అపహరించిన 247 గ్రాముల బంగారు, 90 గ్రాముల వెండి, 3 గ్రాముల ప్లాటినం ఉంగరం రికవరీ
- సి ఐ , ఎస్సైలను అభినందించిన ఎస్పీ





**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగష్టు 28 :** మండలంలోని ధర్మవరం గ్రామంలో జగనన్న కాలనీలో ఆగష్టు 21వ తేదీన పగటిపూట గాలి తలుపులయ్య ఇంట్లో చోటుచేసుకున్న చోరీపై, కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు పోలీసులు నేరం పై దృష్టి సారించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు పర్యవేక్షణలో, ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సూర్య అప్పారావు నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు నేరస్థుల కోసం విచారణ ప్రారంభించాయి. వివరాల పరిశీలనలో సేకరించిన ఖచ్చితమైన సమాచారంతో, గురువారం 28వ తేదీ సాయంత్రం 4 గంటలకు పాదాలమ్మ గుడి ఎదురుగా ఇద్దరు అనుమానితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అత్యంత నిష్ణాతతతో, వీరి ఇంటర్వ్యూ ద్వారా వారిని నేరానికి పాల్పడిన ముద్దాయిలుగా గుర్తించారు. అనుమానితుల వద్ద దొంగలించిన 247 గ్రాముల బంగారు, 90 గ్రాముల వెండి, 3 గ్రాముల ప్లాటినం ఉంగరం, నేరానికి ఉపయోగించిన మోటార్ సైకిల్ మరియు ఐరన్ కటింగ్ మిషన్‌ను రికవరీ చేసి, ముద్దాయిలను రిమాండ్ కు తరలించినట్టు పెద్దాపురం డిఎస్పీ శ్రీ హరి రాజు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ వహించిన సీ.ఐ. బి. సూర్య అప్పారావు, ఎస్ఐ ఎస్. లక్ష్మీకాంతం మరియు వారి సిబ్బంది సాహసోపేత, సమర్థవంతమైన చర్యతో నేరాన్ని త్వరితగతిన కనుగొన్నందుకు జిల్లా ఎస్పీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# మాజీ హెూమ్ మంత్రి తానేటి వనిత కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్టు 28:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ హెూమ్ మంత్రి తానేటి వనిత మావయ్య తానేటి బాబూరావు ఇటీవల స్వర్గస్తులైన విషయం విధితమే. వైఎస్సార్సీపీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తాడేపల్లిగూడెంలో గురువారం మాజీ హెూంమంత్రి తానేటి వనిత కుటుంబాన్ని పరామర్శించి తానేటి బాబురావు మృతికి సంతాపం తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. తానేటి బాబురావు చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి సంతాపం వ్యక్తం చేశారు. మాజీ హెూమ్ మంత్రి తానేటి వనిత, డాక్టర్ శ్రీనివాస్ దంపతులతో కాసేపు కుటుంబ విషయాలు మాట్లాడారు. ఈ సందర్భంగా సంతాపం తెలియజేసిన వారిలో పలువురు నాయకులు ఉన్నారు.

# నూరు శాతం హాజరు తప్పనిసరి





**ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు**

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 28:** పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం ఉండేవిధంగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ డీఈఓ వై మల్లేశ్వరరావు ఆదేశించారు. గురువారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని పలు రికార్డులను, ఉపాధ్యాయుల యొక్క డైరీలు లెసన్ ప్లాన్స్ తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులు 461 మంది గాను 407 మంది విద్యార్థులు మాత్రమే ఉండడంతో నూరు శాతం హాజరు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు తప్పనిసరిగా లీఫ్ హాజరు ఆన్లైన్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి నోట్ బుక్స్ వర్క్ బుక్స్ పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వాలని బేస్ లైన్ గ్రేడింగ్ ఆధారంగా డి గ్రేడ్ ఉన్న విద్యార్థులకు 45 రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లు ను సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్స్ హ్యాండ్ బుక్స్ ప్రతి ఒక్కరి దగ్గర ఉండాలని అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం టిఎల్ఎం ఉపయోగించి విద్యార్థులకు బోధన జరగాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ వర్క్ ,ఇన్నోవేటివ్ యాక్టివిటీస్ విద్యార్థులతో చేయించాలని సూచించారు. అలాగే ప్రతి నెల విద్యార్థులకు హెల్త్ చెకప్ చేయించి హెల్త్ కార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి ,డిప్యూటీ వార్డెన్ లావణ్య తదితరులు ఉన్నారు.

# విద్యుత్ షాక్ తో లైన్ మెన్ మృతి



**పెద్దాపురం, పెన్ పవర్, ఆగస్ట్ 28 :** విద్యుత్ షాక్ తో లైన్ మెన్ మృతి చెందడంతో పాటు మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన పెద్దాపురం పట్టణంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దాపురం పట్టణంలో నివాసం ఉంటున్న కె. రామకృష్ణ స్థానిక పాశిల వీధిలో సహచరుడు చిన్నబాబుతో విద్యుత్ లైన్ మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. ఈలోగా ట్రాన్స్ ఫార్మర్ కు విద్యుత్ ప్రసరించడంతో రామకృష్ణ షాక్ కు గురయ్యాడు. రామకృష్ణను కాపాడే ప్రయత్నంలో చిన్నబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. దీన్ని గమనించిన స్థానికులు వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే రామకృష్ణ మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. చిన్నిబాబును మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్ కు తరలించారు. ఈ విషయంపై సీఐ పి. విజయ శంకర్ పర్యవేక్షణలో ఎస్ఐ వి. మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రాచపల్లి గ్రామంలో రైతుల కోసం పొలంబడి అవగాహన కార్యక్రమం






**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగష్టు 28 :** మండలంలోని రాచపల్లి గ్రామంలో గురువారం రైతుల కోసం ప్రత్యేక పోలంబడి అవగాహన కార్యక్రమన్ని మండల వ్యవసాయ శాఖ అధికారిణి జోకా అమృత ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులు పంటల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, మరియు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి కోసం సరైన పద్ధతులను అవలంబించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. రైతులకు పురుగు మందులు తగ్గించి, కాషాయం స్ప్రే చేయడం ద్వారా పంటలు ఆరోగ్యవంతంగా, పంట ఉత్పత్తి అధికంగా ఉండే విధంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఏడిఏ శ్రీనివాసు హాజరై, రైతులకు ప్రత్యక్షంగా మార్గదర్శకత్వం అందించారు. 14 వారాలపాటు కొనసాగనున్న ఈ పొలంబడి అవగాహన ద్వారా రైతులు పంటల సంరక్షణలో సక్రమంగా వ్యవహరించగలుగుతారని అధికారులు తెలిపారు. రైతులు సరైన పద్ధతులపై అవగాహన పొందడం వల్ల రసాయనాల వినియోగం తగ్గి, పర్యావరణానికి హానికరమైన ప్రభావం కూడా తగ్గుతుందని అధికారులు చెప్పారు.

# ఘనంగా వినాయక చతుర్థి వేడుకలు



**వై.రామవరం, పెన్ పవర్,ఆగస్టు 28:** మండలంలో వినాయక చతుర్థి వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.

విఘ్నాలు నెరవేర్చే గణనాథుని కి వాడ వాడలా అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తొలి పూజలు అందుకునే గణనాథుడు, నవరాత్రులు పూజింపబడతాడు. పోట పోటీలుగా వినాయకుని విగ్రహాల ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. వైరామవరం సెంటర్లో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహానికి పూజలు నిర్వహించే మహిళా భక్తులు ఒకే రకమైన చీరలు ధరించి ఆకర్షణగా నిలిచారని పలువురు అంటున్నారు.

# శ్రీప్రకాష్ లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం






**పెద్దాపురం, పెన్ పవర్, ఆగస్ట్ 28 :** పెద్దాపురం పట్టణ పరిధిలోని స్థానిక రామారావుపేటలో గల శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో ప్రథమ భారతీయ భాషా శాస్త్రవేత్త, తెలుగు వెలుగు గిడుగు వేంకట రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా మాతృ భాషా దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ద్విశత అవధాని, ప్రముఖ ప్రవచనకర్త బులుసు అపర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృమూర్తిపై ఎంత ప్రేమ చూపిస్తామో అలాగే మాతృభాషపై కూడా అంతే ప్రేమ చూపించాలన్నారు. తెలుగు భాషలో ప్రతీ ఒక్క పదాన్ని స్పష్టంగా పలికే ఏ యాసైనా ఈ భాషలో కలిసిపోతుందని అన్నారు. ప్రముఖ యూట్యూబర్, కవి (అమ్మ డైరీలో కొన్ని పేజీలు) మంత్రి రవి మాట్లాడుతూ శ్రీప్రకాష్ పాఠశాల తెలుగుభాషకు పెద్ద పీట వేస్తూ తెలుగుభాషను బ్రతికిస్తున్నాయని ప్రశంసించారు. పాఠశాల అకడమిక్ కోఆర్డినేటర్ యన్. ప్రశాంతి మాట్లాడుతూ భాషను నేర్చుకోవడం చాలా కష్టమని, కమ్మనైన తెలుగు భాషను రక్షించుకోవలసిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.యస్. మూర్తి మాట్లాడుతూ తెలుగుభాషలో ఎంతో పద సంపద ఉందని సామెతలు, జాతీయాలు ఇలా మరెన్నో ప్రక్రియలు ఉన్నాయని విద్యార్థులు ప్రతీరోజూ ఒక కొత్తపదం, వారానికి ఒక పద్యం నేర్చుకోవాలని అప్పుడే తెలుగు భాష ఎప్పుడూ అజరామరంగా ఉంటుందని అన్నారు. పాఠశాల డైరెక్టర్ సిహెచ్. విజయ ప్రకాష్ మాట్లాడుతూ తెలుగు భాషలో ఎన్నో మంచి మంచి పుస్తకాలు, మరెన్నో నీతి శతకాలు ఉన్నాయని, వాటిని విద్యార్థులు వీలు దొరికినప్పుడు చదువుతూ ఉండాలని, కనీసం తెలుగు వార్తాపత్రిక అయినా తరచుగా చదువుతూ ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఆలపించిన పద్యాలు, అలాగే తెలుగు గేయాలు, నృత్యాలు, సామెతలు, శ్రీశ్రీ ఖండికలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జాయింట్ సెక్రటరీ సమీరా , ప్రముఖ న్యాయవాది పైడిపల్లి సూర్యనారాయణమూర్తి (చిన్ని), మీడియా కోఆర్డినేటర్ ఉషా చైతన్య పెద్దాపురం, సామర్లకోట, కాకినాడ ప్రాంతాలకు చెందిన సాహితీవేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారులు



**పెద్దాపురం, పెన్ పవర్, ఆగస్ట్ 28 :** గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారుల నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. మండల పరిధిలోని పులిమేరు నుంచి విరవ గ్రామానికి రూ. కోటీ 65 లక్షల నాబార్డ్ నిధులతో నిర్మించనున్న రహదారి నిర్మాణానికి గురువారం వారు శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతీ గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దే విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు చెప్పారు. గ్రామాల్లో పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మొయిళ్ళ కృష్ణమూర్తి, పులిమేరు గ్రామ సర్పంచ్ తుమ్మల సురేఖా నాని, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాలస్వామి దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం





**ఉంగుటూరు, పెన్ పవర్ ఆగస్టు 28:** ఉంగుటూరు మండలం, కాగుపాడు గ్రామంలో గురువారం శ్రీ బాలగోపాలస్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి కె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొత్తగా ఎంపికైన సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా విశ్రాంత బ్యాంకు అధికారి కడియాల రంగారావు ట్రస్టు బోర్డు ఛైర్మన్‌గా, కడియాల రామచంద్రరావు ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. సభ్యులుగా ఈమని వెంకటలక్ష్మి, దుక్క కళావతి, గోపవరపు కృష్ణవేణి, అద్దంకి పెద్దిరాజు, దుక్క రామకృష్ణ, భీమవరపు రాజేశ్వరి ప్రమాణ స్వీకారం చేశారు.

అనంతరం గ్రామస్థులు, కూటమి నాయకులు కొత్త పాలకమండలి సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో నారాయణపురం సొసైటీ ఛైర్మన్ కడియాల రవిశంకర్, తెదేపా మండల అధ్యక్షుడు వేములపల్లి సుధీర్, నాయకులు ఇమ్మణ గంగాధర్, యడ్లపల్లి చంటి, పడవల మహంకాళిరావు, ఏవీ పురం సర్పంచి ధర్మారావు పాల్గొన్నారు.

## తాళ్ళపూడి మండలంలో అంగరంగ వైభవంగా గణపతి నవరాత్రులు



**తాళ్ళపూడి, పెన్ పవర్, ఆగస్ట్ 28:** తాళ్లపూడి మండలంలోని ప్రతి గ్రామంలో వీధి వీధిలో గణపతి నవరాత్రులు పురస్కరించుకొని, బుధవారం గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు మండపాలు ఏర్పాటు చేసి, గణపతి విగ్రహాలను నిలపెట్టడం జరిగింది. మండలంలో గణేష్ మండపాలు విద్యుత్ దీపాలంకరణతో మెరిసిపోతున్నాయి. అదేవిధంగా గణపతి బప్పా మోరియా అంటూ గణపతి మండపాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. కొన్ని మండపాల సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం అనంతరం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని తెలియజేశారు.

## వాడ వాడలా ఘనంగా చవితి వేడుకలు

### -కిర్లంపూడిలో భారీగా వెలసిన వినాయకుని విగ్రహాలు.





కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 28: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కిర్లంపూడి సంత మార్కెట్ లో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహాన్ని ఎంతో అట్టహాసంగా ఏర్పాటు చేసి వేద పండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చవితి వేడుకలను పురస్కరించుకుని ఆలయానికి కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరం గ్రామాలతో పాటు, చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదము స్వీకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మాజీ మంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం ఆశీస్సులతో గత 43 సంవత్సరాలుగా శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం వద్ద వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అలరించిన చిన్నారుల కోలాట భజన



**ఉంగుటూరు, పెన్ పవర్ ఆగస్టు 28:** ఉంగుటూరు మండలంలోని నారాయణపురం వైయస్సార్ కాలనీలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గురువారం రాత్రి కోలాట భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరపల్లి కోలాట భజన సమాజానికి చెందిన చిన్నారులు ఆడిన కోలాట నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి.
తరువాత పలు ఆధ్యాత్మిక భజన కీర్తనలు ఆలపించడంతో కాలనీ ఆధ్యాత్మిక వాతావరణంలో మారుమోగింది. ఉత్సవ కమిటీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని తిలకించారు.

## తొలి పూజలు అందుకునే గణనాథునికి వరదలు అడ్డు కాదు



**కూనవరం, పెన్ పవర్, ఆగస్టు 28.** తొలి పూజలు అందుకొని, సర్వ విఘ్నాలు తొలగించే గణనాథుని ప్రతిష్టించి మండలంలో భక్తులు ఘనంగా వేడుకలను జరుపుకుంటున్నారు. వర్షాలు, వరదలు మండలాన్ని చుట్టు ముట్టిన ఆయనను కొలిచే భక్తులు మాత్రం ఆయన్ని మాత్రం మరువలేదు. మండలంలోని ప్రతి గ్రామంలో గణనాథుని ప్రతిష్టించి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కూనవరం, టేకులబోరు ను వరదలు, వర్షాలు చుట్టూ ముట్టిన ఆయన కొలిచే భక్తులు గణనాథుని ప్రతిష్టించి పూజలు, నైవేద్యాలు సమర్పించి పూజారితో గోత్ర నామాలు, పూజలు, నిర్వహించారు.

## మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు-ఎస్సై అంకారావు





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 28:** రాజమహేంద్రవరం గ్రామీణ మండలంలోని హుకుంపేట గ్రామం, కుంబకోణం కాఫీ షాప్ సమీపంలో నిషేధిత మత్తు పదార్థాల రవాణా జరుగుతున్నట్లు బొమ్మూరు పోలీస్ స్టేషన్‌కు అందిన సమాచారంపై ఎస్ఐ రాజులపాటి అంకారావు సిబ్బందితో కలిసి తక్షణమే సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో హుకుంపేటకు చెందిన ఏ1అమన్ పాండే, విశాఖపట్నంకు చెందిన ఏ2 మండపాటి తేజస్వి వర్మ లను పట్టుకుని, వారి వద్ద నుండి సుమారు 18 గ్రాముల మెత్ డ్రగ్ విలువ రూ. 90,000, నగదు రూ. 1,07,720, రెండు మొబైల్ ఫోన్లు, చిన్న గ్లాస్ పైప్, గ్యాస్ లైటర్, నల్లరంగు బ్యాగ్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రాథమిక విచారణలో స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాన్ని వారు బెంగళూరులోని ఏ3 చందన్ రాజ్ నుండి కొనుగోలు చేసి, స్థానికంగా ఏ4 సాండీ ఇతరులకు అధిక ధరకు విక్రయించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందని చెప్పారు. దీనిపై బొమ్మురు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
ఈ సందర్భంగా నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయంపై జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని, ఈ విధమైన అక్రమ కార్యకలాపాలలో నిమగ్నమయ్యే ఎవరైనా కఠిన శిక్షార్హులవుతారని ప్రజలకు హెచ్చరించడం జరిగింది.

## వర్షాలు వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

### లోతట్టు ప్రాంత ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలి.



**ఎటపాక పెన్ పవర్ ఆగస్టు 28:** ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు పెరుగుతున్న గోదావరి నది వరద ఉదృతకు లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బి జె వై ఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మూడే సతీష్ కుమార్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు, గోదావరి వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదేవిధంగా చేపల వేటగాని ఈతకు వెళ్లడం గాని వంటి కార్యక్రమాలను వరదలు తగ్గేవరకు చేయకూడదని, ప్రజల పట్ల అధికారులు సోదర భావంతో మెలిగి వరదల సమయంలో వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ అందుబాటులో ఉండాలని, పొంగిపొర్లుతున్న వాగులు వంకల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, వరదల పట్ల ప్రమాదాలు జరిగితే అత్యవసర సేవలకై వైద్యాధికారులు 24 గంటల అందుబాటులో ఉండాలని, ఈ వరదలకు త్రాగునీరు కలుషితం అవుతుందని అందుకు ప్రత్యామ్నాయంగా మంచినీరు ఏర్పాటు చేయాలని, గ్రామాలలో ప్రజలు రోగాల బారిన పడకుండా తరచూ పారిశుధ్య పనులను చేపడుతూ బ్లీచింగ్ చల్లాలని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి అని బిజెవైఎం రాష్ట్ర నాయకులు మూడే సతీష్ కుమార్ నాయక్ కోరారు.

## సోలార్ కనెక్షన్ తో ఆర్థిక లబ్ధి

ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం. పెన్ పవర్ ఆగస్టు 28 :** ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ప్రతి ఇంటికి సోలార్ కనెక్షన్ వేసుకుని కరెంట్ బిల్లు ఆదా చేసుకొని ఆర్థికంగా లబ్ధి పొందాలని, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో డ్వాక్రా యానిమేటర్ లకు, ఆర్. పి లకు విద్యుత్ అధికారులకు జరిగిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు.

## ఎట్టకేలకు ఏలేరు జలాశయానికి జలకళ.



**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 28:** ఎట్టకేలకు ఏలేరు జలాశయానికి గురువారం నాటికి జలకళ వచ్చింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫానుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వివిధ ప్రాజెక్టులకు ఊహించని స్థాయిలో వరదలు వచ్చి పొంగి, పలు జలాశయాలు పొంగి పొర్లడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కానీ ఏలేరు పరివాహక ప్రాంతంలో వర్షాలు కరువ అయ్యాయి. గురువారం ఉదయం 6 గంటలకు ప్రాజెక్ట్ అధికారులు అందించిన వివరాలు ప్రకారం రిజర్వాయర్ ప్రాంతంలో ఒక మిల్లీమీటర్ వర్షపాతం కురిసినట్లు తెలిపారు. అయితే ఏలేరు జలాశయానికి ఎగువ ప్రాంతాల నుండి 1557 క్యూసెక్కుల నీరు మాత్రమే వచ్చి చేరుతుంది. దీంతో అధికారులు పురుషోత్తం పట్నం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 1050 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేయబడుతుందని తెలిపారు. మొత్తానికి రిజర్వాయర్ లోకి ఇన్ఫ్లోస్గా 2607 క్యూసెక్కుల నీరు చేరుతుంది. దీంతో ఏలేరు జలాశయానికి జలకళ వచ్చింది. కాగా1700 న్యూసెక్ ల ఏలేరు జలాలను ఔట్ ఫ్లోస్ గా ప్రాజెక్ట్ అధికారులు విడుదల చేస్తున్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం 13 లక్షలు

**అమలాపురం.పెన్ పవర్ ఆగస్టు 28** :డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణం లో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ఆగస్టు 28 గురువారం దేవదాయ శాఖ తనిఖీదారు జె.రామలింగేశ్వర రావు పర్యవేక్షణ లో రెండు నెలల పద్దెనిమిది రోజులకు ఆలయ హుండి తెరిచి లెక్కించగా రూ.13,42,036/- లు వచ్చినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## స్మార్ట్ కార్డుల పంపిణీ కి రంగం సిద్ధం




**అమలాపురం.పెన్ పవర్ ఆగస్టు 28**: రాష్ట్ర ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి రంగం సిద్ధం చేసిందని సెప్టెంబర్ 6 వ తేదీ నుండి స్మార్ట్ కార్డులు పం పిణీకి సిద్ధం కావాలని జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ రేషన్ డీలర్లను,ఉప తాహసిల్దార్లను ఆదేశించారు.గురువారం ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల నందు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ గూర్చి శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా పౌర సరఫరాల అధికారి అధ్యక్షతన నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం డేటా ఈ బేస్ లో ఉన్న అర్హులైన కుటుంబాల వివరాలతో ఈ స్మార్ట్ కార్డును రూపొందించారన్నారు.ప్రతి కుటుంబానికి యూనిక్ క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ కార్డును ముద్రించారని తెలిపారు.ఈ కార్డులో కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ నంబర్లు,రేషన్ షాప్ వివరాలు వంటివి ఉంటాయన్నారు

కుటుంబ వివరాలను ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డు,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మొదలైన వాటితో క్రాస్ చెక్ చేస్తారన్నారు.

నకిలీ లేదా డూప్లికేట్ కార్డులను తొలగిస్తారన్నారు.గ్రామ,వార్డు స్థాయి అధికారుల ద్వారా అర్హులైన కుటుంబాలకు కార్డులు పంపిణీ చేయాలన్నారు.

కార్డు అందజేసేటప్పుడు బెని ఫిషియరీ యొక్క ఆధార్ లేదా బయోమెట్రిక్ ద్వారా ధృవీక రించబడుతుందన్నారు.రేషన్ షాప్లో స్మార్ట్ కార్డు చూపించి క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయిం చాలన్నారు.క్యూ ఆర్ కోడ్ ద్వారా సెంట్రల్ సర్వర్ నుంచి కుటుంబ వివరాలు, లభ్యమయ్యే రేషన్ కోటా రియల్ టైమ్లో వస్తాయన్నారు.రేషన్ సరుకులు జారీ చేసిన తర్వాత, ట్రాన్సాక్షన్ ఆటోమేటిక్గా సర్వర్లో రికార్డ్ అవుతుందన్నారు.డూప్లి కేట్ ,నకిలీ కార్డులు అనుగుణంగా తగ్గుతాయన్నారు.రేషన్ సరుకుల పంపిణీ పారదర్శకంగా జరుగుతుందన్నారు. లబ్ధిదారుల వివరాలు ఆన్లైన్లో వెంటనే అప్డేట్ అవుతాయన్నారు.ఆధార్ ,బయోమెట్రిక్ ధృవీకరణ వల్ల దుర్వినియోగం జరగదన్నారు.. ప్రభుత్వ కొత్త ఆలోచనలు రూపొందించిన స్మార్ట్ కార్డులను,రూపొందించిందన్నారు.ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు తావులేకుండా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ,అత్యంత పగడ్బందీగా స్మార్ట్ రేషన్ రూపొందించారని సెప్టెంబర్ ఆరవ తేదీ నుంచి సాధారణ కార్డు దారులకు రేషన్ షాపుల వద్ద అందజేస్తారని తెలి పారు. కార్డుదారులు బయోమెట్రిక్, ఓటిపి ద్వారా కార్డులు పొందవచ్చున్నారు.ఈ స్మార్ట్ కార్డుల్లో ప్రభుత్వ చిహ్నం మాత్రమే ఉంటుందన్నారు.ప్రస్తుతం ఇవ్వ నున్న స్మార్ట్ కార్డులు బ్యాంకు డెబిట్ కార్డు (ఏటీఎం)ల తరహాలో ఉండ నున్నాయన్నారు.పారదర్శ కతతో రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ ద్వారా డైనమిక్ కీ రిజిస్టర్తో వీటిని అనుసంధానం చేస్తారన్నారు. రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టవచ్చని వీటిని ఐడెంటిటీ కార్డుల కింద కూడా వినియో గించు కోవచ్చున్నారు.స్మార్ట్ ఈ–పోస్ మిషన్లను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తేనుందని, ఇప్పుడిస్తున్న స్మార్ట్ కార్డులను ఈ యంత్రం ద్వారా స్వైప్ చేస్తే కార్డుదారుడి వివరాలు వస్తాయన్నారు. గతంలో యంత్రాలతో వచ్చిన సర్వర్ సమస్యలు ఉండవ న్నారు. సిమ్, వైఫై, హాట్స్పాట్, బ్లూ టూత్, టచ్ స్క్రీన్ వంటి ఆధునిక సదుపాయాలతో, ఆండ్రాయిడ్ సాంకేతికతతో పని చేస్తుందన్నారు.వేలి ముద్ర పడకున్నా యంత్రం లో కెమెరా ద్వారా ఐరిస్ స్కాన్ చేయవచ్చున్నారు.తాజా పరిణామాల తో రేషన్ పంపిణీ వ్యవస్థ నూతన సాంకేతిక మార్పులతో అత్యంత పకడ్బందీగా మారనుందన్నారు.ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు పౌరసరఫరాల శాఖ ఉప తాహసిల్దార్లు పాల్గొన్నారు.

# రంప జిల్లా ఏర్పాటు చేయాల్సిందే





**గంగవరం, పెన్ పవర్ ,ఆగస్టు 28:**రంపచోడవరం నియోజకవర్గం ను రాజమండ్రి జిల్లాలో విలీనం చేయకుండా రంప జిల్లాగా ప్రకటించాలని రంప జిల్లా లక్ష్య సాధన కమిటీ డిమాండ్ చేసింది. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన గిరిజన నాయకులు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ రాజమహేంద్రవరం జిల్లాలో విలీనం చేయడం వల్ల గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ఆచారాలు వ్యవహారాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజమండ్రిలో కలపడం వల్ల గిరిజనులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ఉపాధి ఉద్యోగులతో పాటు యువత కార్మిక కర్షక వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఆదివాసీలంతా ఏకతాటి పైకి వచ్చి రంపచోడవరం ప్రత్యేక జిల్లా సాధనకు ప్రణాళికను సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. ప్రత్యేక జిల్లా సాధనకు విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకుని ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని సమావేశం తీర్మానించింది. కొత్త జిల్లా ఏర్పడడం వల్ల స్థానిక గిరిజన నాయకులకు రాజ్యాంగపరమైన పదవులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు బేబీ రత్నం ,పండ వెంకటలక్ష్మి ,ఎంపీపీలు బంధం శ్రీదేవి, వెంకటలక్ష్మి, జనసేన వీర మహిళ వరలక్ష్మి, బిజెపి జిల్లా కార్యదర్శి కుంజం వెంకటేశ్వర్లు దొర, ఉద్యోగ సంఘాల నాయకులు కత్తుల ఆది రెడ్డి, లక్ష్మణరావు గిరిజన సంఘాల నాయకులు వెదుళ్ళ లచ్చిరెడ్డి ,అంజిరెడ్డి , బోజ్జయ్య, సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి యోగ పోటీలకు ఎంపికైన కాకినాడ విద్యార్థులు

**కాకినాడ,ఆగస్టు 28 పెన్ పవర్:**రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలలో విజేతలుగా నిలిచిన కాకినాడ ఎంఎస్ఎన్ చార్టిస్ హైస్కూల్కు చెందిన రాక్ యోగ అకాడమీ విద్యార్థులు పి. కృష్ణ అంజి, కె. వెంకటేష్ జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు.పెంటపాడు మండలం ప్రత్తిపాడులో ఆగస్టు 21 నుంచి 24 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో వీరు పాల్గొని ఆర్టిస్టిక్ ఫెయిర్ విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. ఫలితంగా సెప్టెంబర్ నెలలో విజయవాడలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారని రాక్ డాన్స్ అండ్ యోగ స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్ %డ% డైరెక్టర్, నేషనల్ యోగాసన కోచ్ డి.ఎస్. ప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా విజేతలను, కోచ్ డి.ఎస్. ప్రసాద్ను ఆంధ్రప్రదేశ్ యోగ విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షులు యోగాచార్య చిట్టూరి చిట్టిబాబు, హైస్కూల్ హెడ్మాస్టర్ ఎమ్.ఎస్. సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సర్వరాయుడు, ఉపాధ్యక్షుడు లోవరాజు, సభ్యులు రాధిక జైన్, కల్పన, భారతి తదితరులు అభినందించారు.



## ప్రభుత్వ సేవల స్థాయిలను మెరుగుపరచాలి

**అమలాపురం.పెన్ పవర్ ఆగస్టు 28:** ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ,ప్రభుత్వ సేవల పట్ల ప్రజాసంతృప్తి స్థాయిలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరావతి నుండి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నీటి సంరక్షణ, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు పూడికతీత,నవీనీ కరణ, పునరుద్ధరణ, పీఎం కుసుమ స్కీం, ప్రజా సంతృప్తి స్థాయిల పురోగతి డాక్యుమెంట్లు అప్లోడ్, యూరియా ఎరువులు అందుబాటు,ఎరువుల ధరల నియంత్రణ జిల్లా స్థాయిలో జువైనల్ జస్టిస్ కమిటీల ఏర్పాటు అంశాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సౌరశక్తిని ప్రోత్స హించడం,తద్వారా రైతులు తమ విద్యుత్ అవసరాలను తామే తీర్చుకోవడంతో పాటు ఆదాయాన్ని పెంచాలన్నారు. డీజిల్ పంపుసెట్లను సౌర శక్తితో నడిచే పంపుసెట్లుగా మార్చు కొని ఆదాయాన్ని పొందేలా ప్రోత్సహించాలన్నారు. తద్వారా డీజిల్ వాడకం తగ్గడం వల్ల ఖర్చు ఆదా అవుతుందన్నారు పర్యావరణ కాలుష్యం తగ్గుతుందనీ,ఈ పంపు సెట్ల కొనుగోలుకు ప్రభుత్వ సబ్సిడీ లభిస్తుం దన్నారు.సామాజిక భద్రతా పింఛన్లు సక్రమంగా పంపిణీ పంపిణీ చేయడంతో పాటు అన్నా క్యాంటీన్లు,ఆలయాలలో దర్శనాలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక అంశాలు ఆర్టీసీ వసతులు, ఆసుపత్రి సేవలో మరింతగా ప్రజాసం తృప్తి స్థాయిలను పెంచాలని ఆదేశించారు.వివిధ శాఖలకు చెంది శాఖాపర మైన ముఖ్య మైన డాక్యుమెంట్లను అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతాంగానికి యూరియా ఎరువుల కొరత లేకుండా ధరలను నియంత్రిస్తూ సరఫరా చేయాలని ఆదేశించారు, ఎరువుల డీలర్లు ధర పెరుగుతుందనే ఉద్దేశంతో కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు గైకొనాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ టీ. నిషా%శీ%తి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



## పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌కు రాజకీయ పార్టీల సహకారం అవసరం : డీఆర్వో వెంకట్రావు





**కాకినాడ, ఆగస్టు 28 పెన్ పవర్:** జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) జె. వెంకట్రావు కోరారు.గురువారం కలెక్టరేట్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన ఆయన, ఎన్నికల కమిషన్ సూచనల మేరకు చేపడుతున్న ఓటర్ జాబితా కార్యక్రమాలు, పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ, కొత్త కేంద్రాల ప్రతిపాదనలు, ఫారమ్–6,7,8 పరిష్కారాలు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలను వివరించారు. డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 1000%–%1200 మంది ఓటర్లు ఉన్న 443 పోలింగ్ స్టేషన్లు, 1200 మందికి పైబడి ఉన్న 423 స్టేషన్లు ఉన్నాయని, వీటిలో సుమారు 400 కేంద్రాలను ఓటర్ల సౌలభ్యం కోసం పునర్వ్యవస్థీ కరించి, కొత్త కేంద్రాలను ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. అలాగే అనువుకాని కేంద్రాలను తగిన భవనాలకు మార్చుతామని, రేషనలైజేషన్ ప్రకారం జిల్లాలో కొత్తగా 183 పోలింగ్ కేంద్రాలు ఏర్పడనున్నాయని వెల్లడించారు. ప్రస్తుతం 1640 పోలింగ్ కేంద్రాల్లో 16,40,278 మంది ఓటర్లు నమోదై ఉన్నారని వివరించారు.రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి బిఎల్ఏ–2 ఫారమ్లో వివరాలు సమర్పించాల ని సూచించారు.సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు గదుల సాయిబాబా (టిడిపి), రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్ఆర్సిపి), ఎవివి సత్య నారాయణ (జనసేన), సిహెచ్. రమేష్ బాబు (బిజెపి), సబ్బారపు అప్పారావు (బిఎస్పి), పి. శ్రీనివాసు (ఐఎన్సీ), తోకల వరదరాజు నంబి (ఆప్), పలివెల వీరబాబు (సీపీఎం) పాల్గొన్నారు. ఎన్నికల విభాగ పర్యవేక్షకుడు ఎం. జగన్నాథం హాజరయ్యారు.

# పలు అంశాలను సమీక్షించిన జిల్లా కలెక్టర్





**అమలాపురం.పెన్ పవర్ ఆగస్టు 28:** సముద్ర తీరపు నీటి అడుగు భాగాన సముద్రపు నాచు పెంచుట, పీతల హేచరీ స్థాపన, పీతల పెంపకానికి సంబంధించి ఎక్స్పోజర్ సందర్శనలు నిర్వహించి యూనిట్ల స్థాపనకు చర్యలు గైకొనాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ మత్స్య శాఖ డిఆర్డిఏ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు కేంద్ర మంత్రిత్వ శాఖ పర్యావరణ,అటవీ క్లైమేట్ చేంజెస్ శాస్త్రవేత్తలు డాక్టర్ మహమ్మద్ రఫీక్ డాక్టర్ జయంతి సుతార్ మత్స్య శాఖ అటవీ శాఖ, జిల్లా కోఆర్డినేషన్ అసోసియేట్ సభ్యులు డిఆర్డిఏ అధికారుల తో సమావేశం నిర్వహించి సముద్రపు నాచు యూనిట్లు స్థాపన పీతల హేచరీ పీతల పెంపకం అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావ రణ మరియు అటవీ క్లైమేట్ చేంజ్ నిపుణులు తీర ప్రాంతంలో పర్యటించి ప్రదేశాలను ఎంపిక చేస్తారన్నారు .పర్యా వరణ అటవీశాఖ శాస్త్రవేత్తలు ఇప్పటికీ, ఒరిస్సా మహారా ష్ట్రలో యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.మన కోనసీమ తీర ప్రాంతం కూడా సముద్రపు నాచు తయారీకి అనువైన ప్రాంతమని గుర్తించి యూనిట్ల స్థాపనలో 50% ఆర్థిక సహాయం అందిం చేందుకు ముందుకు రావడం జరిగింద న్నారు. ఆ ప్రకారం జిల్లాలో తొలి దశలో సముద్రతీర ప్రాంతంలో నాచు తయారీకి 20 యూనిట్ల ఏర్పాటుకు సమగ్ర ప్రతిపా దనలు రూపొందించా లని ఆదేశించారు.తొలుతగా ఎక్స్పోజర్ విజిట్ కు ఒరిస్సాకు కమ్యూనిటీ మొబలైజేషన్ మహిళలను వారి భర్తలతో మత్స్యశాఖ ఎఫ్డిఓ లతో పంపేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. వీరు సముద్రపు నాచు తయారీ ప్రాసెసింగ్ విధానాలు ప్యాకింగ్ అంశాలపై పూర్తిగా తర్ఫీదును పొందేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.అదేవిధంగా మరొక టీం ను పీతల హేచరీ నిర్వహణకు సంబంధించి రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్ కేంద్రానికి మత్యశాఖ సిబ్బం దితో కూడిన అధ్యయన బృందాన్ని పంపించాలన్నారు. యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన పరికరాలను సీడును రవాణా తో సహా ఆన్లైన్ పేమెంట్లు నిర్వహిస్తూ యూనిట్ల స్థాపనకు చర్యలు తీసు కోవా లన్నారు. పీతల హేచరీని ప్రకృతి నుంచి పీతలు తక్కువగా దొరకడం వలన కృత్రిమంగా పేదలను పెంచి తయారుచేసి రైతుల కు అందించడం ద్వారా అధిక దిగుబడునీ , ఆదాయాన్ని హేచరీల ఏర్పాటు ద్వారా పొందేం దుకు చర్యలు చేపట్టాలన్నారు. పీతల పెంపకానికి తగినంత సహకారం అందించాలన్నారు. ఈ యూనిట్ల స్థాపన ద్వారా రానున్న మూడు సంవత్సరాలలో తీర ప్రాంత మత్స్యకారులు ఎస్ ఎస్ జి మహిళలు సుస్థిరాభివృద్ధిని సాధించాలని ఆయన ఆకాంక్షించారు.అక్టోబర్ 15 నాటికి పూర్తిస్థాయి ప్రతి పాదనలను క్రోడీకరించి యూనిట్ల స్థాపనకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. తీర ప్రాంత రక్షణ కవచంగా నిలుస్తున్న మడ అడవుల పునరుద్ధరణ ప్లాంటేషన్ చర్యలపై ఆయన అటవీ శాఖ అధికారులతో సమీక్షించి తగు సూచనలు చేశారు.సముద్రపు ఆటు పోట్ల సక్రమంగా జరిగేలా మరియు మడ అడవులు అంతరించి పోతున్నచోట్ల ప్లాంటేషన్ కొరకు సి ఎస్ ఆర్ నిధుల ద్వారా చర్యలు చేపట్టాలన్నారు.సముద్రపు నాచు తయారీ యూనిట్లకు ఎస్ హెచ్ జి పండింగు చేస్తూ పర్యావరణ అటవీ క్లైమేట్ చేంజింగ్ నిధులు సక్రమంగా వినియోగిస్తూ సుస్థిర జీవనో పాదులు పెంపొందించి,ఈ ప్రాంత అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే. మాధవి,జిల్లా మత్స్య శాఖ అధికారి జిఎస్ శ్రీనివాసులు డిఆర్డిఏ పిడి సాయినాథ్ జయచంద్ర గాంధీ, జిల్లా కోఆర్డినేషన్ అసోసియేట్ శ్రీహర్ష జిల్లా అటవీశాఖ అధికారి ఎం.వి ప్రసాదరావు, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గుబ్బల ఏసురాజు పుట్టిన రోజు వేడుకలు





**కాజులూరు, ఆగస్టు 28 పెన్ పవర్:**కూటమి సీనియర్ నాయకుడు గుబ్బల ఏసురాజు జన్మదిన వేడుకలు గురువారం రామచంద్రపురంలోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాజులూరు మండల పరిధి, రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన కూటమి నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.జన్మదినం సందర్భంగా రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆయన తండ్రి వాసంశెట్టి సత్యం ఫోన్ ద్వారా ఏసురాజుకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.అలాగే మంజేరు సొసైటీ మాజీ చైర్మన్ గండి కిషోర్,జనసేన యువ నాయకుడు డేగల నాగేంద్ర, జనసేన వీరమహిళ సలాది పుష్ప, కూటమి నాయకులు తోట కృష్ణ, మాత నాగరాజు, బుంగా నాగేశ్వరరావు, పంపన కృష్ణ, ధరణి, వల్లు అర్జునరావు, పెంకే సత్యనారాయణ,సర్పంచ్ లు, ఎంపీటీసీలు ,తదితరులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.వేడుకలలో పాల్గొన్న నాయకులు, అభిమానులు ఏసురాజు ఆరోగ్యంగా,సుఖ సంతోషాలతో దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆకాంక్షించారు.

# నూకాంబిక అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ గా శ్రీనివాసరావు



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఆగస్టు 28) :**నర్సీపట్నం మున్సిపాలిటీ అబీద్ సెంటర్‌లోని శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయానికి కొత్త కమిటీని గురువారం ఉదయం అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతకాయల రాజేష్, దేవాదాయ శాఖ ఈవో సాంబశివరావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కమిటీ సభ్యులను రాజేష్ కండువాలు కప్పి పరిచయం చేశారు. ఆలయ చైర్మన్‌గా కొరుప్రోలు శ్రీనివాస్‌రావు, వైస్ చైర్మన్‌గా దాడి శ్రీను బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కమిటీ సభ్యులందరినీ ఈవో సాంబశివరావు ప్రమాణస్వీకారం చేయించారు.

చింతకాయల రాజేష్ మాట్లాడుతూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు నూతన ఆలయ కమిటీ ఏర్పాటు జరిగింది. గత ఐదు సంవత్సరాలుగా అమ్మవారి పండుగలు అంతంత మాత్రంగానే జరిగాయని, తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలో అంగరంగ వైభవంగా జాతర నిర్వహించామని అన్నారు. అలాగే, గత టిడిపి ప్రభుత్వంలో ఆలయ నిర్మాణానికి అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులు పది లక్షలు విరాళంగా ఇచ్చినందున, దేవాదాయ శాఖ నుంచి 40 లక్షల రూపాయలు కేటాయించబడిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ నిధులతో నిర్మాణం వైఎస్ఆర్సీపీ ప్రభుత్వంలో ప్రారంభమైనప్పటికీ, స్లాబ్ లీకేజీలు, గర్భగుడిలో నిర్మాణ లోపాలు వంటి సమస్యలు తలెత్తాయని తెలిపారు. తాజాగా గుడి పూర్తి కోసం మళ్లీ స్పీకర్ కుటుంబ సభ్యులు మరో 10 లక్షలు చెల్లించగా, దేవాదాయ శాఖ మరో 40 లక్షల రూపాయలు కేటాయించిందని తెలిపారు. త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తవుతుందని, కొత్త కమిటీపై అమ్మవారి పండుగలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన బాధ్యత ఉందని సూచించారు.

ఆలయ చైర్మన్ కొరుప్రోలు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు కుటుంబానికి ధన్యవాదాలు తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి పండుగను అత్యంత వైభవంగా జరిపామని, ఇకపై అమ్మవారి ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ కౌన్సిలర్ జాలుమూరి బంగార్రాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రుత్తల కృష్ణ, రావణాపల్లి ఆవ చైర్మన్ రాజేశ్వరరావు, కౌన్సిలర్లు ధనిమిరెడ్డి మధు, లాలం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జీకే వీధి నూతన ఎస్ఐ ను మర్యాదపూర్వకంగా కలిసిన పాత్రికేయులు

**గూడెం కొత్త వీధి, ఆగస్ట్ 28:** గూడెం కొత్త వీధి పోలీస్ స్టేషన్‌కు నూతనంగా నియమితులైన ఎస్సై కె. సురేష్‌ను గురువారం గూడెం కొత్తవీధి విలేకరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ మాట్లాడుతూ, "ప్రజలకు ఉత్తమ సేవలందించడంలో మీడియా సహకారం ఎంతో కీలకం. సమాచారాన్ని సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడంలో మీ సహకారం మాకు అవసరం. ప్రజలతో మా అనుబంధాన్ని బలోపేతం చేయడంలో విలేకరుల పాత్ర ఎంతో గొప్పది" అని తెలిపారు. ఎస్సైను మర్యాదపూర్వకంగా కలిసిన విలేకరుల్లో జీకే వీధి విలేకరుల సంఘం అధ్యక్షుడు సాయం రమణ (ప్రజా ప్రతిభ), సుర కత్తి లక్ష్మణ్ బాబు (ఈనాడు), బండి ధారబాబు (ఆంధ్రజ్యోతి), మాదిరి చంటిబాబు (పెన్ పవర్), సాగిన లక్ష్మణరావు (ఆంధ్రప్రభ), గబులంగి హనుమంతరావు (విశాలాంధ్ర), బోండ్ల గాంధీ (నిజం), సాగిన శివకుమార్ (జ్యోతి), బత్తుల తారక రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## దుంబ్రిగుడ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన సీఐ.



**దుంబ్రిగుడ, పెన్ పవర్, ఆగష్టు 28:** స్థానిక మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను అరకు సి ఐ హిమగిరి గురువారం సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా పనిచేసి ప్రజా మన్ననాలు పొందాలన్నారు.మండలంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నవరాత్రులు ముగింపు అనంతరం నిమజ్జన కార్యక్రమాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు వీలుగా చవితి విగ్రహాల ఏర్పాటు నిర్వాహకులకు ఎటువంటి అల్లర్లు లేకుండా చూడాలని సలహా సూచనలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై పి పాపినాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు.



**దుంబ్రిగుడ, పెన్ పవర్, ఆగష్టు 28:** వినాయక చవితి ఉత్సవాలను స్థానిక మండల కేంద్రంలో అల్లూరి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కించమండ, అరుకు, గుంతసీమ పంచాయతీ కేంద్రాలతో పాటు మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో ఈ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆశ్రమ పాఠశాల, కేజీబీ పాఠశాలల్లో పండగను ఉత్సాహంగా జరుపుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థులు పండగ జరుపుకుని సాయంత్రం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి వెంకట్రావు, అల్లూరి యూత్ అధ్యక్ష, కార్యదర్శులు కె సూర్య, ఎం నవసూర్య, జి ఉదయ్ స్వరూప్, సురేంద్ర, మాజీ జెడ్పిటిసిఎం శ్రీరాములు, వైసిపి నాయకులు ఏం శంకర్రావు, కె విజయదశమి, టిడిపి నాయకులు ఎం స్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సీపట్నం యువ బాక్సర్లకు బంగారు పతకాలు



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఆగష్ట్ 28) :**తిరుపతిలో జరిగిన అమరావతి అండర్-22 కేటగిరి చాంపియన్‌షిప్ కప్ 2025 రాష్ట్రస్థాయి బాక్సింగ్ టోర్నమెంట్‌లో నర్సీపట్నం అమ్మాయిలు మరోసారి ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో పాల్గొన్న మహిళా బాక్సర్లు యర్రా తేజస్విని (81 కేజీలు), బొంతు మౌనిక (75 కేజీలు) స్వర్ణ పతకాలు సాధించి విశేష గౌరవాన్ని అందుకున్నారు. విజేతలకు క్రీడా రంగంలో మరింత ప్రోత్సాహకరంగా, ఈ నెల 29న విశాఖపట్నంలో జరగనున్న స్పోర్ట్స్ డే వేడుకలలో సీఎం చంద్రబాబు, నారా లోకేష్, శాప్ చైర్మన్, రాష్ట్ర స్పోర్ట్స్ మంత్రి సమక్షంలో మెడల్స్, నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయనున్నారు. ఈ విజయం వెనుక మహిళా కోచ్ వేపాడ ప్రియాంక ప్రత్యేక కృషి చేసినట్లు తెలిపారు. యువ బాక్సర్లకు శిక్షణ అందించిన శాప్ బాక్సింగ్ కోచ్ అబ్బు వారి గెలుపుపై ఆనందం వ్యక్తం చేశారు. నర్సీపట్నం నుంచి జాతీయ స్థాయిలో బంగారు పతకాలు తెచ్చి ప్రతిభ చాటిన తేజస్విని, మౌనికలను నింజాస్ అకాడమీ డైరెక్టర్స్ వెలగా నారాయణ, సుతాపల్లి శ్రావణ్, సుతాపల్లి శ్రీకాంత్, వెలగా జగన్నాద్ బంగారునాయుడు అభినందించారు. విజేత బాక్సర్ల తల్లిదండ్రులతో పాటు శాప్ ఆధ్వర్యంలో ఈమెడలిస్టులకు రూ.30,000 నగదు, సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేయనున్నట్లు ప్రకటించారు. నర్సీపట్నం క్రీడా ప్రస్థానంలో ఈ విజయాలు మైలురాయిగా నిలుస్తాయని స్థానిక క్రీడా వర్గాలు పేర్కొన్నాయి.

## సవరబాస వాలంటీరుల ను నిర్మించాలి.

- **మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సవరభాస వాలంటీరు నియమించాలి.**
- **భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాండ్.**



**గుమ్మలక్ష్మీపురం, కురుపాం 28.పెన్ పవర్:** కురుపాం మండలం జి.శివడ పంచాయితీ మధురవలస గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సవరభాసవాలంటరి నియమించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ మన్యం జిల్లా ఉపాధ్యక్షులు గంగారావు,జిల్లా కమిటీ సభ్యులు సింహాచలం పార్వతిపురం ఐటీడీఏ విద్యాశాఖ అధికారి గారికి వినతి పత్రన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కురుపాం మండలం జి.శివడ పంచాయతీ మధురవలస,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 15 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని అందులో ఐదుగురు విద్యార్థులు సవర భాష విద్యార్థులని కానీ మాతృభాషలో బోధించేందుకు అధ్యాపకులు లేరని దీనివల్ల అక్కడ విద్యార్థులకు మాతృభాష అధ్యాపకం దూరమవుతుందని అన్నారు తక్షణమే వాళ్లకు భాషా వాలంటరీను నియమించాలని డిమాండ్ చేశారు.

# భారత్ పై ట్రంప్ సుంకాల వెనుక అసలు కారణం అదా?



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో భారత ఎగుమతులపై 50 శాతం వరకు సుంకాలు విధింపబడ్డాయి. ఈ చర్య ఒకే ప్రశ్నను రేకెత్తిస్తోంది. ఇది నిజంగా రష్యా చమురు కారణంగానా? లేక భారత్‌పై వ్యూహాత్మక ఒత్తిడా? అన్నది తేలాల్సి ఉంది. నీతిఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్‌కాంత్ సూటిగా చెప్పినట్లే, ఈ టారిఫ్‌లకు రష్యా చమురుతో సంబంధం లేదని స్పష్టమవుతోంది. రష్యా చమురుకు అతిపెద్ద కొనుగోలుదారు చైనా. యూరప్ కూడా రష్యా ఇంధనంపై బాగా ఆధారపడి ఉంది. అయినా ఎందుకు భారత్‌పైనే కఠిన సుంకాలు? అమెరికా తన "మిత్రదేశం"పై ఇంత కఠినంగా వ్యవహరించడం సహజంగానే సందేహాలను రేకెత్తిస్తోంది. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఇప్పటికే స్పష్టంచేశారు. రష్యా నుంచి అత్యధిక దిగుమతులు భారత్ కాదని, చైనా, యూరప్ అని. అంతేకాదు, రష్యా నుంచి చమురు కొనుగోలు చేయాలని అమెరికానే సూచించిందని ఆయన గుర్తుచేశారు. అయినా ఇప్పుడు అదే విషయాన్ని ఆయుధంలా ఉపయోగించి భారత్‌పై సుంకాల మోత మోగించడం తార్కికతను కోల్పోయిన నిర్ణయమే.

**భారత్‌కు మేల్కొలుపు**

ఈ పరిస్థితిని ఓ మేల్కొలుపుగా తీసుకోవాలని అమితాబ్‌కాంత్ పిలుపు గమనార్హం. నిజమే భారత్ తన ఇంధన భద్రత, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిపై రాజీపడలేదు. అంతర్జాతీయ ఒత్తిళ్లను ఎదుర్కొంటూ వచ్చిన దేశం మనది. ఈసారి కూడా అదే ధైర్యంతో నిలబడాల్సిన అవసరం ఉంది.

**వాణిజ్యంపై ప్రభావం**

సుమారు 48 బిలియన్ డాలర్ల ఎగుమతులపై నేరుగా ప్రభావం చూపే ఈ సుంకాలు తాత్కాలికంగా మన ఆర్థిక వ్యవస్థకు భారమవుతాయి. వాణిజ్య రంగం ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేస్తోంది. అమెరికా ఉత్పత్తులపై ప్రతీకార సుంకాల విధానం పరిగణనలోకి తీసుకోవాలని పరిశ్రమ వర్గాలు సూచిస్తున్నాయి. ఇది సమంజసమే. ఎందుకంటే, ఏకపక్ష చర్యలకు ఎదురు ప్రతిస్పందన అవసరం.

**ముందున్న సవాలు.. అవకాశం కూడా..**

ప్రపంచ వాణిజ్యంలో అమెరికా చూపుతున్న ద్వంద్వ వైఖరి భారత్‌ను కొత్త దారుల వైపు నడిపే అవకాశముంది. సుంకాల దెబ్బ మనకు ఇబ్బందే అయినా అదే సంస్కరణలకు, కొత్త వాణిజ్య భాగస్వామ్యాల అన్వేషణకు కారణమవ్వాలి. మొత్తం మీద ట్రంప్ టారిఫ్‌లు కేవలం రష్యా చమురు కారణం కాదని స్పష్టమవుతోంది. ఇవి భారత్‌పై వ్యూహాత్మక ఒత్తిడికి మరో రూపం. ఇలాంటి సందర్భాల్లో భారత్ వెనకడుగు వేయకుండా తన స్వయంప్రతిపత్తిని కాపాడుకుంటూ ముందుకు సాగాల్సిందే.

# బుద్ధిపోనిచ్చుకోని చైనా.. పాక్ కు ఆహ్వానం.. మోడీకి లేదు



**హైదరాబాద్ పెన్ పవర్:** బీజింగ్‌లో జరగనున్న చైనా 80వ విక్టరీ పరేడ్ చుట్టూ ఇప్పటికే రాజకీయ చర్చలు రగులుతున్నాయి. జపాన్‌పై సాధించిన విజయాన్ని గుర్తు చేసుకుంటూ చైనా ప్రతీ ఏటా నిర్వహించే ఈ వేడుకలకు ఈసారి మరింత ఆర్భాటంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సెప్టెంబర్ 3, 2025న జరిగే ఈ కార్యక్రమానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్వయంగా ఆహ్వాన పత్రాలు పంపించారు.

**పాక్ ప్రధానికి ఆహ్వానం.. భారత్‌కు నిరాకరణ**

చైనా ఆహ్వానించిన 26 దేశాధినేతల జాబితాలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రత్యేకంగా ప్రస్తావన పొందారు. అంతేకాదు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ, మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు తదితర నేతలు కూడా ఈ వేడుకలకు హాజరుకానున్నారు. అయితే ఆశ్చర్యకరంగా భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఆహ్వానం అందలేదు. దీంతో ఈ ఘన వేడుకలో భారత్ ప్రాతినిధ్యం ఉండకపోవడం ఖాయమైంది.

**SCO సదస్సుకు మోదీ హాజరు**

ఇదే సమయంలో అదే వారం చైనాలో జరగనున్న షాంఘై సహకార సంస్థ ) సదస్సులో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు జరిగే ఈ సమావేశం SCO చరిత్రలోనే అతిపెద్దదిగా ఉండనుందని చైనా ప్రకటించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ సహా 20 దేశాల నేతలు ఈ సదస్సులో హాజరవుతారు.

**భారత్ – చైనా సంబంధాల నేపథ్యం**

గత కొన్ని ఏళ్లుగా భారత్ – చైనా సంబంధాలు గట్టిగా పరీక్షకు గురవుతున్నాయి. 2018లో మోదీ చివరిసారి చైనాను సందర్శించారు. ఆ తర్వాత జిన్‌పింగ్ భారత్ పర్యటించారు. కానీ 2020లో లద్దాఖ్ గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణలో ఇరు దేశాల సైనికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనతో సంబంధాలు క్షీణించాయి. ఆ తర్వాత రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

**అమెరికా సుంకాలతో కొత్త మలుపు**

ఇక మరోవైపు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా నిర్ణయం కూడా చర్చనీయాంశమైంది. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తోందని కారణంగా భారత్ వస్తువులపై 50 శాతం టారిఫ్ విధించారు. ఆగస్టు 27 నుంచి అమలులోకి వచ్చిన ఈ నిర్ణయం, భారత్ నుంచి అమెరికాకు జరిగే 48 బిలియన్ డాలర్ల ఎగుమతులపై ప్రభావం చూపనుంది.

**రాబోయే రోజుల్లో అంతర్జాతీయ సమీకరణలు**

ఈ పరిణామాల నేపథ్యంలో చైనాలో జరగనున్న %ాజూ% సమావేశంపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. అమెరికా వైఖరిపై పలు దేశాలు వ్యతిరేకంగా స్పందించే అవకాశముంది. చైనా%–%పాక్ సాన్నిహిత్యం, భారత్‌కు ఎదురవుతున్న ఆర్థిక%–%దౌత్యపరమైన సవాళ్లు రాబోయే కాలంలో అంతర్జాతీయ రాజకీయాలపై పెద్ద ప్రభావం చూపనివి కావు.

మొత్తం మీద చైనా విక్టరీ పరేడ్‌లో పాక్ ప్రధానికి ఆహ్వానం ఇవ్వడం, మోదీని పక్కన పెట్టడం వెనుక ఉన్న రాజకీయ సంకేతాలపై ప్రపంచ దృష్టి పడింది.

# రాహుల్ చేతిలో మరో బాంబు...పేల్చేది అపుడేనా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆగస్టు నెలలో అతి పెద్ద రాజకీయ సంచలనానికి కాంగ్రెస్ అగ్ర నేత లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు తెర తీశారు. ఏకంగా కేంద్ర ఎన్నికల సంఘం మీద తీవ్ర ఆరోపణలు చేశారు. దానికి ఆయన పెట్టిన పేరు ఓటు చోరీ. బీజేపీకి ఈసీ ఎన్నికల్లో సాయం చేస్తోంది అని ఆయన తన దగ్గర ఉన్న ఆధారాలను అన్నింటినీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించే ప్రయత్నం చేశారు. దాంతో ఒక్కసారిగా దేశంలోనే కలకలం రేగింది. ఓట్ల చోరీ అంటూ రాహుల్ అందుకున్న నినాదం మీద మేధావులు ఇతర వర్గాలు చదువరులలో సైతం ఆలోచనలు రేకెత్తించాయి. సరి కొత్త చర్చలు అయితే అంతటా మొదలయ్యాయి.

**అదే ఊపుతో అలా**

ఇక చూస్తే కనుక ఆగస్ట్ 7న ఢిల్లీ వేదికగా మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ ఓట్ల చోరీ మీద ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ తరువాత ఏ మాత్రం ఆలస్యం చేయలేదు. పార్లమెంట్ ఒక వైపు జరుగుతూంటే ఎంపీలతో కలసి ఆయన ఈసీ కార్యాలయం దాకా ప్రదర్శన నిర్వహించారు అదే ఊపులో ఆయన బీహార్ రాష్ట్రమంతా ఓటర్ అధికార్ యాత్రను చేపట్టారు. దానికి జనంలో మంచి స్పందన లభిస్తోంది. ఆయన దాదాపుగా ప్రతీ రోజూ ప్రతీ సభలోనూ ఈసీని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కలిపి ఎండగడుతున్నారు ఓట్ల చోరీ జరిగింది అన్నది అంతా నమ్ముతున్నారని కూడా అంటున్నారు

**మరో బాంబు రెడీనా**

ఇదిలా ఉంటే ఇదే స్పీడ్ లో రాహుల్ గాంధీ బీహార్ నుంచి ఒక సంచలన ప్రకటన చేశారు. ఓట్ల చోరీ పెద్ద ఎత్తున జరిగిందని నిరూపిస్తాను అని కూడా రాహుల్ గాంధీ గర్జిస్తున్నారు. ఒక్క బీహార్ లోనే ఏకంగా 65 లక్షల ఓటర్ల పేర్లు లేకుండా పోయాయని రాహుల్ ఆరోపించారు బీజేపీ కేంద్ర ఎన్నికల సంఘం కలసి ఈ విధంగా ఓట్లు తొలగించారని రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇలా ఓట్లు పోగొట్టుకున్న వారిలో ఎక్కువగా బాధితులుగా ఉన్నది బడుగు బలహీన వర్గాలవారేనని రాహుల్ అంటున్నారు.

**మరిన్ని ఆధారాలున్నాయి :**

ఓట్ల చోరీ జరిగింది అనడానికి తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని రాహుల్ గాంధీ అంటున్నారు. రానున్న రోజులలో 2024 లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ ఏ విధంగా జరిగింది అన్నది కూడా వివరిస్తాను అని ఆయన చెప్పడం విశేషం. ఇప్పటిదాకా కర్ణాటక హర్యానా, మహారాష్ట్రలలో ఓట్ల చోరీ జరిగింది అని మాత్రమే చెబుతూ వచ్చిన రాహుల్ గాంధీ ఇపుడు దేశవ్యాప్తంగా జరిగిన లోక్ సభ ఎన్నికల్లో సైతం ఓట్లు గల్లంతు అయ్యాయని వాటి పూర్తి సమాచారం తన దగ్గర ఉందని అంటున్నారు.

**మరో పవర్ పాయింట్ ప్రజంటేషన్ :**

ఇదిలా ఉంటే ప్రస్తుతం రాహుల్ గాంధీ ఓటర్ అధికార యాత్ర పేరుతో బీహార్ లో యాత్ర నిరహిస్తున్నారు. అది ఈ నెల 17న ప్రారంభం అయింది. ఈ నెల చివరి దాకా కొనసాగుతుంది. సెప్టెంబర్ 1న పాట్నాలో జరిగే బహిరంగ సభతో ఈ యాత్ర ముగుస్తుంది ఆ తరువాత రాహుల్ గాంధీ లోక్ సభ ఎన్నికల్లో జరిగిన ఓట్ల చోరీ గురించి మరో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వబోతున్నారు అని అంటున్నారు. ఇప్పటికే ఓట్ల చోరీ ఆరోపణల మీద ఈసీ వివరణ ఇచ్చినప్పటికీ అది ఏ మాత్రం సరిపోవడం లేదు రాహుల్ గాంధీ జనంలోకి వెళ్తున్నారు వారి మధ్యనే అంతా చర్చకు పెడుతున్నారు. జనాల నుంచి వస్తున్న ఆదరణతో మరింత సమాచారం ఉందని అంటున్నారు రాహుల్ గాంధీ మరో పవర్ పాయింట్ ప్రజంటేషన్ తో ఎన్ని సంచలనాలు దేశ రాజకీయాల్లో నమోదు అవుతాయో అన్న చర్చకు తెర లేస్తోంది.

# వర్షం చెప్పిన అసలు కథ: రోడ్డెక్కిన కండోలిమ్‌లు.. ప్రజల్లో కలకలం!



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో ఐదు రోజులపాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు పట్టణాల్లో రహదారులు చెరువుల్లా మారగా, గుంటూరులో మాత్రం వర్షం ఒక వింత దృశ్యాన్ని బయటపెట్టింది.

**అరండల్‌పేట రహదారులపై విచిత్ర దృశ్యం**

గుంటూరు నగరంలోని ఎప్పుడూ రద్దీగా ఉండే అరండల్‌పేట రోడ్డుపై వర్షపు నీటితో పాటు అనుకోకుండా పెద్ద సంఖ్యలో కండోలిమ్‌లు కొట్టుకువచ్చి పడటంతో స్థానికులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. రహదారులపై వాటిని చూసిన ప్రజలు తీవ్ర అసహనానికి గురై చీదరించారు. వినాయక చవితి సందర్భంగా మండపాలకు వచ్చే భక్తులు కూడా ఆ దృశ్యాన్ని చూసి విస్మయం వ్యక్తం చేశారు.

**లాడ్జి నుంచి బయటకు వచ్చినవేనా?**

ఆ కండోలిమ్‌లు ఒక లాడ్జి ముందు రోడ్డు మీద కనిపించడంతో ఆ లాడ్జిలో అసలు ఏం జరుగుతుంది అన్న అనుమానాలు ప్రజల్లో మొదలయ్యాయి. వర్షం నీటితో అవి బయటకు కొట్టుకువచ్చి రహదారిపైకి చేరినట్లు స్థానికులు చెబుతున్నారు. దీనితో ఆ లాడ్జి కార్యకలాపాలపై అనుమానాలు ముదురుతున్నాయి.

**ప్రజల ప్రశ్నలు – పోలీసుల మౌనం**

నగర నడిబొడ్డులో ఇలాంటి దృశ్యం కనబడుతుంటే పోలీసులు ఏమి చేస్తున్నారు

అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. లాడ్జి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్లపై కండోలిమ్‌లు కొట్టుకువచ్చిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో, ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**వర్షం చెప్పిన కథ**

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా రహదారులు మునిగిపోయాయి. కానీ ఈ వర్షం గుంటూరులోని ఒక లాడ్జి రహస్యాలను కూడా అందరికీ బహిర్గతం చేసింది. ఇకనైనా సంబంధిత అధికారులు మేల్కొని ఆ లాడ్జిపై విచారణ జరిపి,

# డేటింగ్ యాప్.. వీళ్లు మామూలు ముదుర్లు కాదండోయ్!




**హైదరాబాద్ పెన్ పవర్:** అప్డేట్ అవుతున్న జనరేషన్లో చాలామంది మహిళలు, పురుషులు డేటింగ్ యాప్ లను వాడుతున్నారు. ఈ డేటింగ్ యాప్ ద్వారా తమ అభిరుచులకు సెట్ అయిన పురుషుడిని గానీ మహిళను గానీ ఎంచుకొని కొన్ని రోజులు డేటింగ్ చేసి పెళ్లిళ్లు చేసుకోవడం చేస్తున్నారు. ఇక మరికొన్ని మ్యాట్రిమోనీ యాప్ లలో ప్రొఫైల్స్ క్రియేట్ చేసుకుని పర్ఫెక్ట్ జోడి కోసం వెతుక్కుంటున్నారు. అయితే తాజాగా డేటింగ్ యాప్ లకు సంబంధించి ఒక సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. అదేంటంటే డేటింగ్ యాప్ లను మగవాళ్ళ కంటే ఎక్కువగా ఆడవారే యూస్ చేస్తున్నారట. అవును మీరు వినేది నిజమే.. తాజాగా ఒక ప్రముఖ డేటింగ్ యాప్ సిఈఓ ఈ విషయాన్ని బయటపెట్టారు. మరి ఇంతకీ ఆయన చెప్పిన విషయంలో ఉన్నది ఎంత నిజం అనేది ఇప్పుడు తెలుసుకుందాం..

సాధారణంగా ఇంట్లో మహిళలకు కట్టుబాట్లు అనేవి ఉంటాయి. ఇంట్లో నుంచి బయటికి వెళ్తే ఏ టైంకి రావాలి.. ఎవరెవరితో ఉండాలి అనేది ఇంట్లో అమ్మా, నాన్న, అన్న, భర్త ఇలా ఎవరో ఒకరు కండిషన్ పెడుతూ ఉంటారు. కానీ ఇప్పటి జనరేషన్ చాలా మారిపోయింది. అమ్మాయిలు కూడా పురుషుల లాగే అన్ని రంగాలలో రాణిస్తున్నారు. అలా అబ్బాయిలతో సరి సమానంగా ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. అయితే అన్ని రంగాల్లో లాగే ఈ డేటింగ్ యాప్ లలో కూడా మగాళ్లకు మేము ఏమాత్రం తీసిపోము అంటున్నారు అమ్మాయిలు. ఎందుకంటే తాజాగా ఒక ప్రముఖ డేటింగ్ యాప్ వాళ్లు తమ డేటింగ్ యాప్ లో మగవాళ్ళ కంటే మహిళ యూజర్ లే ఎక్కువగా ఉన్నారంటూ తేల్చేశారు.

తాజాగా Knot డేటింగ్ యాప్ సీఈఓ అయినటువంటి జస్వీర్ సింగ్ డేటింగ్ యాపుల్లో మహిళా యూజర్ లే ఎక్కువ ఉన్నారని, మగవాళ్ళు తక్కువగా ఉన్నారని తెలియజేశారు. జస్వీర్ సింగ్ మాట్లాడుతూ..Knot డేటింగ్ యాప్ లో 57% మహిళ సబ్స్క్రైబర్లు ఉన్నారు అంటూ తెలియజేశారు.ఇక 57% మహిళా సబ్స్క్రైబర్లు ఉంటే మిగిలిన 43% మంది పురుష యూజర్లు ఉన్నారన్నమాట. అలా వాళ్ళ డేటింగ్ యాప్ లో మగవాళ్ళ కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారని ఆయన తెలియజేశారు. అంతే కాదు మా డేటింగ్ యాప్ లో ఆరు నెలల సబ్స్క్రిప్షన్ కోసం 57,459 రూపాయల ఫీజు పెట్టినా కూడా మహిళ యూజర్లు వెనకడుగు వేయడం లేదు. మగవాళ్ళ కంటే వీళ్లే ఎక్కువ డబ్బులు చెల్లించి సబ్స్క్రైబ్ చేసుకుంటున్నారు అంటూ సంచలన విషయం బయటపెట్టారు. ప్రస్తుతం Knot డేటింగ్ యాప్ సీఈవో చెప్పిన ఈ విషయం విన్న చాలామంది నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. అంతేకాదు కలికాలం అంటూ మరి కొంతమంది మగవాళ్లు కామెంట్స్ పెడుతున్నారు. ఇక అమ్మాయిలేమో మగవాళ్ళ కంటే అమ్మాయిలు ఏ విషయంలో కూడా తీసిపోరు అని చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఆన్లైన్లో టిండర్,బంబుల్, గ్రిండర్, Knot వంటి ప్రముఖ డేటింగ్ యాప్ లు ఉన్నాయి. డేటింగ్ యాప్ ల వల్ల చాలామంది అభిప్రాయాలు కలిసి పెళ్లిళ్లు చేసుకున్న వారు ఉన్నారు. మరి కొంతమంది పెళ్లిళ్లు కాకుండా డేటింగ్ లు చేసి నచ్చకపోతే బ్రేకప్ చెప్పుకున్న వాళ్ళు కూడా ఉన్నారు.

# పవర్ హిట్టర్స్, యార్కర్ల వీరులకు పండగే..
## ఇంగ్లాండ్ దిగ్గజ క్రికెటర్ రెండు కొత్త రూల్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మెన్స్ ఇంటర్నేషనల్ క్రికెట్‌లో ఇటీవలే చాలా కొత్త రూల్స్ ప్రకటించింది. టెస్ట్ క్రికెట్ లో స్టాప్ క్లాక్, లాలాజల నియమంలో మార్పు, DRS విధానంలో కొత్త మార్పు, షార్ట్ రన్ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంది. క్రికెట్ ను మరింత ఆసక్తికరంగా మార్చడానికి ఇంగ్లాండ్ దిగ్గజ క్రికెటర్.. మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ క్రికెట్ లో రెండు సరికొత్త రూల్స్ ను ప్రతిపాదించాడు. పవర్ ఫుల్ హిట్టర్లకు ఈ రూల్ ఊరించేలా చేస్తుంది. మరోవైపు యార్కర్లు వేసే బౌలర్లకు ఈ రూల్ అనుకూలంగా ఉంది.

### 100 మీటర్లు కొడితే 12 పరుగులు:

పీటర్సన్ మాట్లాడుతూ.. " నేను ఇంతకు ముందే చెప్పాను. ఇప్పుడు మళ్ళీ చెబుతున్నాను. ఒక బ్యాటర్ కొట్టిన సిక్సర్ 100 మీటర్లు దాటితే జట్టుకు ఆరు పరుగులు కాకుండా 12 పరుగులు ఇవ్వాలి. ఈ రూల్ పెడితే బ్యాటర్లు భారీ సిక్సర్లు కొట్టడానికి ప్రయత్నిస్తారు. అప్పుడు క్రికెట్ ఫ్యాన్స్ కు ఎక్కువ ఎంటర్ టైన్ లభిస్తుంది". అని ఈ ఇంగ్లాండ్ క్రికెటర్ అన్నాడు. క్రికెట్ లో 100 మీటర్ల సిక్సర్లు చాలా అరుదుగా కొడుతూ ఉంటారు. పీటర్సన్ రూల్ పై భిన్న అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. క్రికెట్ లో బేసిక్ రూల్స్ ను మార్చడమేంటి అంటూ కొంతమంది విమర్శలు గుప్పిస్తున్నారు.

### మిడిల్ స్టంప్ కు బాల్ తగిలితే నెక్స్ట్ బ్యాటర్ ఔట్:

"ఒక బౌలర్ మిడిల్ స్టంప్‌ను పడగొట్టి వికెట్ తీస్తే నెక్స్ట్ వచ్చే బ్యాటర్ కూడా ఔట్ గా ప్రకటించాలి. దీని వలన బౌలర్లు ఎక్కువగా యార్కర్లు వేయడంపై దృష్టి పెడతారు". అని అన్నాడు. పీటర్సన్ చెప్పిన దాన్ని బట్టి చూస్తే బౌలర్ మిడిల్ స్టంపు ను పడగొడితే రెండు వికెట్లు తీసినట్టే. ఈ రూల్ పాయ్ కూడా నెటిజన్స్ పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. టెస్టు క్రికెట్ లో అద్భుతమైన బ్యాటర్ గా పేరు తెచ్చుకున్న పీటర్సన్ 2025 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో మెంటార్ గా ఉన్నాడు.

# లాకీ ఫెర్గూసన్ ఆల్ టైమ్ టాప్-5 టెస్ట్ బౌలర్లు వీరే..
## టీమిండియా పేసర్లకు నో ఛాన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ క్రికెట్ లో ఎంతో మంది ఫాస్ట్ బౌలర్లు తమదైన ముద్ర వేశారు. కొంతమంది స్వింగ్ తో బోల్తా కొట్టిస్తే మరి కొంతమంది తమ వేగంతో బయపెట్టేవారు. మరికొందరైతే బౌన్సర్లతో బ్యాటర్లకు చుక్కలు చూపించేవారు. వీరందరికి డిఫరెంట్ గా యార్కర్లతో ఇబ్బంది పెట్టే పేసర్లు ఉన్నారు. న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ లాకీ ఫెర్గూసన్ తన ఆల్ టైమ్ టాప్-5 టెస్ట్ బౌలర్ల వ్యక్తిగత లిస్ట్ ను షేర్ చేశాడు. వీరిలో ఒక్కరు కూడా ఇండియన్ పేసర్ లేదు. క్రిక్‌ట్రాకర్‌కు ఇచ్చిన స్పెషల్ ఇంటర్వ్యూలో పాకిస్తాన్ నుండి ఇద్దరు దిగ్గజాలుకు చోటివ్వగా న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్లలో ఒకొక్కరికి ఛాన్స్ ఇచ్చాడు. వారెవరో ఇప్పుడు చూద్దాం..

**షేన్ బాండ్ (న్యూజిలాండ్): ఖ**
కెరీర్ ప్రారంభంలో ఫ్యూచర్ స్టార్ బౌలర్ గా కితాబులు అందుకున్న షేన్ బాండ్ కెరీర్ గాయాల కారణంగా స్వల్ప కాలానికే పరిమితమైంది. టెస్ట్ కెరీర్‌లో కేవలం 18 మ్యాచ్‌ల్లో 87 వికెట్లతో తన సుదీర్ఘ ఫార్మాట్ కెరీర్ ను ముగించాడు. యావరేజ్ 22.09 కాగా స్ట్రైక్ రేట్ 38.76 ఉంది. షేన్ బాండ్ స్ట్రైక్ రేట్ (కనీసం 2,500 బంతులు) లో ఆల్-టైమ్ బౌలర్ల జాబితాలో రెండో స్థానంలో ఉండడం విశేషం. బాండ్ ఫిట్ గా ఉన్న సమయంలో తన వేగంతో బ్యాటర్లకు చుక్కలు చూపించేవాడు.

**మిచెల్ జాన్సన్ (ఆస్ట్రేలియా):**
ఆస్ట్రేలియాకు లెఫ్టర్మ్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ జాన్సన్ ఈ లిస్ట్ లో రెండో స్థానంలో ఉన్నాడు. 2010 దశాబ్దంలో జాన్సన్ టాప్ బౌలర్. అతని బౌన్సర్లతో బ్యాటర్లను ఇబ్బందిపెట్టేవాడు. ఓవరాల్ గా జాన్సన్ తన టెస్ట్ కెరీర్ లో 28.40 సగటుతో 313 టెస్ట్ వికెట్లను పడగొట్టాడు. వీటిలో 12 సార్లు ఐదు వికెట్ల ఘనతలు ఉన్నాయి. 2013-14 యాషెస్ సిరీస్‌లో విశ్వరూపమే చూపించాడు. ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో 37 వికెట్లు పడగొట్టి ఔరా అనిపించాడు.

**షోయబ్ అక్తర్ (పాకిస్తాన్):**
'రావల్పిండి ఎక్స్‌ప్రెస్' అని పిలువబడే షోయబ్ అక్తర్ ను ఫెర్గూసన్ తన టెస్ట్ బెస్ట్ బౌలర్ల జాబితాలో చోటిచ్చాడు. ఎక్స్‌ప్రెస్ వేగంతో బౌలింగ్ చేస్తూ బ్యాటర్లను ముప్పు తిప్పలు పెట్టిన అక్తర్ బౌలింగ్ ఆడడం అప్పట్లో ఒక ఛాలెంజ్. క్రికెట్ చరిత్రలో 161.3 కి.మీ/గం వేగంతో వేగవంతమైన డెలివరీ రికార్డు సైతం ఈ పాక్ బౌలర్ పేరిట ఉండడం విశేషం. ఓవరాల్ టెస్ట్ కెరీర్ విషయానికి వస్తే 46 టెస్టులలో 25.69 సగటుతో 178 వికెట్లు పడగొట్టాడు.

**వసీం అక్రమ్ (పాకిస్తాన్):**
ఫెర్గుసన్ జాబితాలో చేరిన మరో బెస్ట్ బౌలర్ పాకిస్తాన్ పేసర్ వసీం అక్రమ్. క్రికెట్ చరిత్రలో గ్రేటెస్ట్ లెఫ్ట్ హ్యాండర్ బౌలర్ గా అక్రమ్ కు పేరుంది. ఓ వైపు వేగంగా బంతులు వేస్తూనే బంతిని రెండు వైపులా స్వింగ్ చేయగలడు. బాల్ ను రివర్స్ స్వింగ్ చేయడంలో తనకు తానే సాటి. 90 వ దశకంలో అక్రమ్ బౌలింగ్ ను ఎదుర్కోవడం బ్యాటర్లకు ఒక పీడకల. తన టెస్ట్ కెరీర్ లో ఓవరాల్ గా 104 మ్యాచ్‌ల్లో 23.62 సగటుతో 414 వికెట్లను అక్రమ్ తన ఖాతాలో వేసుకున్నాడు. వీటిలో 25 ఐదు వికెట్ల ఘనతలు ఉన్నాయి. 'సుల్తాన్ ఆఫ్ స్వింగ్' గా పేరు తెచ్చుకున్న అక్రమ్ వన్డేల్లో 500 వికెట్లను పడగొట్టిన ఏకైక బౌలర్.

**కర్ట్లీ అంబ్రోస్ (వెస్టిండీస్):**
వెస్ట్ ఇండియన్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ కర్ట్లీ అంబ్రోస్ కు ఫెర్గూసన్ తన లిస్ట్ లో చోటు కల్పించాడు. ఆరడుగుల అంబ్రోస్ బౌన్సర్లను ఎదుర్కోవడం 1980ల్లో బ్యాటర్లకు అతి పెద్ద పరీక్షగా మారింది. 1990 దశాబ్దంలో కూడా ప్రపంచ క్రికెట్ లో తన ఆధిపత్యాన్ని కొనసాగించాడు. అంబ్రోస్ టెస్ట్ కెరీర్ విషయానికి వస్తే ఓవరాల్ గా 98 మ్యాచ్‌ల్లో 20.99 సగటుతో 405 టెస్ట్ వికెట్లు పడగొట్టాడు. వీటిలో 22 సార్లు ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. 1993లో ఆస్ట్రేలియాపై 1 పరుగుకు 7 వికెట్లు తీసి మైండ్ బ్లోయింగ్ స్పెల్ వేశాడు.

# నేను ఫోటోలు తీసేవాళ్లను నమ్మను.. నటి ఫికర్!





వైబ్రెంట్ ఆరెంజ్ డ్రెస్‌లో కంగనా శర్మ స్టన్స్

నేను ఫోటోలు తీసేవాళ్లను నమ్మను.. కొన్ని ఫోటోలను తీసి ఉద్దేశపూర్వకంగా వాటిని జూమ్ చేయడం ద్వారా సంచలనాలను సృష్టించాలని అనుకుంటారు%--% అని అన్నారు కృతి సనోన్. తాను పొట్టి దుస్తుల్లో ఉన్నప్పుడు ఫోటోగ్రాపర్లు తనను రకరకాల కోణాల్లో ఫోటోలు తీసేందుకు ఆరాటపడతారని, కానీ తాను వేదికలపైకి వెళ్లినప్పుడు తన సహచరులను తనకు ముందుగా నిలబడాలని రెక్వెస్ట్ చేస్తానని కూడా కృతి చెప్పింది. వారు చూసే కోణం తప్పుడు కోణం.. ఉద్దేశపూర్వకంగా అలాంటి ఫోటోలు తీస్తారు! అని కూడా కృతి అన్నారు. సినీరంగంలో ఎదగాలనుకున్న నటీమణులకు ఇలాంటి వ్యక్తుల వల్ల సమస్యలు తలెత్తుతాయని కూడా తెలిపారు. అయితే సెలబ్రిటీల గోప్యతను కాపాడే విషయంలో హాలీవుడ్ మీడియా పద్ధతిగా ఉంటుందని కూడా కృతి కితాబిచ్చింది. ఓసారి ప్రియాంక చోప్రా గౌన్ వేదికపైనే జారిపోతుండగా, ఆ సమయంలో తన గౌరవాన్ని కాపాడుతూ అంతర్జాతీయ మీడియా దానిని షూట్ చేయలేదని చెప్పింది. కానీ భారతీయ మీడియా అలా కాదు. శరీర అందాలను హైలైట్ చేయాలని తహతహలాడుతుంది. వీటిని మీడియాలు స్పెషల్ స్టోరీలుగా వేస్తారు. అయినా మీడియా, సెలబ్రిటీల మధ్య పరస్పర గౌరవం ఉండాలి! అని కృతి పేర్కొంది. అసలు మీడియాలు మహిళలను ఎలా చూస్తాయో చెప్పాలని కూడా కృతి ఈ సందర్భంగా కోరారు. ఇది త్రోబ్యాక్ వీడియో అయినా జోరుగా వైరల్ అవుతోంది.మహిళల రక్షణ, గోప్యత, గౌరవం గురించి కృతి మాట్లాడిన విషయాలు అందరికీ నచ్చాయి. కృతి సనోన్ తో పాటు ఇటీవలి కాలంలో పలువురు యువనటీమణులు ఇండస్ట్రీలో సమస్యలపై బహిరంగంగా చర్చిస్తూ చర్చల్లోకొస్తున్నారు. కాక్ టైల్ 2, తేరే ఇష్క్ మే అనే రెండు భారీ చిత్రాల్లో కృతి సనోన్ నటిస్తోంది.



చిక్ క్యాజువల్ గ్లామ్‌లో నటాషా సింగ్ స్టన్స్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com